

# పల్లె వెలుగు

తెలుగు జాతీయ దిన పత్రిక

అవినీతిపై నిఘా

GST No.37ACDFM5465G1Z1

RNI-APTEL/2012/46499

No: KNL/3`78(D)/2026`2028

Published From : KURNOOL circulated at Nandyal,Srikakulam,VishakaPatanam,Vijayanagaram,East Godavari ,West Godavari, Krishna, Guntur,Prakasam, Nellore,Chittoor, Kurnool,Kadapa,Anantapuram, Hyderabad

ఎడిటర్ : ఎం. మహేష్ యాదవ్ సంపుటి -14 సంచిక - 252 పేజీలు - 08 వెల - 05/-

సోమవారం 07-09-2026


నంద్యాలలో ఉచిత కృత్రిమ కాలు అందజేతకు కొలతలు.





హైదరాబాద్‌లో 'అహింసా

## స్థూపం'..

హైదరాబాద్ మియాపూర్‌లో 'అహింసా స్థూపం' ఏర్పాటు

అహింస బలహీనత కాదని, అదొక గొప్ప బలమని కిషన్ రెడ్డి వ్యాఖ్య

స్థూపం ఏర్పాటులో చొరవ తీసుకున్న జైన మహిళలను కొనియాడిన కేంద్రమంత్రి

వికసిత్ భారత్ లక్ష్య సాధనకు ఐక్యత అవసరమని పిలుపు

కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి. కిషన్ రెడ్డి ఆదివారం హైదరాబాద్‌లోని మియాపూర్‌లో 'అహింసా స్థూపం' ఆవిష్కరించారు. శాంతి, అహింస

ప్రైవేటీకరణ అంటూ కథనాలు..

# క్లారిటీ ఇచ్చిన ఇస్రో

ప్రైవేట్ రంగ భాగస్వామ్యం సామర్థ్యాన్ని పెంచడానికేనని వెల్లడి



- ప్రైవేటీకరణ వార్తలను ఖండించిన భారత అంతరిక్ష సంస్థ
- మా పాత్ర తగ్గదు, మరింత కీలకమవుతుందని స్పష్టీకరణ
- అధునాతన పరిశోధనలపై దృష్టి పెడతామన్న ఇస్రో
- 2035 నాటికి భారతీయ అంతరిక్ష్ స్టేషన్ ఏర్పాటు లక్ష్యం

భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ (ఇస్రో)ను ప్రైవేటీకరిస్తున్నారంటూ గత కొద్ది రోజులుగా మీడియాలో వస్తున్న ఊహాగానాలకు సంస్థ ఆదివారం పూర్తిస్థాయిలో తెరదించింది. ఇస్రోను ప్రైవేటీకరించే ఆలోచన లేదని, దేశ అంతరిక్ష ప్రయోగాలలో దాని ప్రాధాన్యం ఎప్పటికీ తగ్గదని స్పష్టం చేసింది. ఈ మేరకు 'ఎక్స్' వేదికగా ఒక సుదీర్ఘ ప్రకటన విడుదల చేసింది. ఇస్రో భవిష్యత్ పాత్రపై కొన్ని మీడియా సంస్థలు అసత్యాలు, తప్పుడు సమాచారాన్ని ప్రచారం చేస్తున్నాయని, ఈ కథనాలు పూర్తిగా నిరాధారమైనవని ఇస్రో పేర్కొంది. "ఇస్రోను ప్రైవేటీకరించరు, దాని ప్రాముఖ్యాన్ని తగ్గించరు. అత్యాధునిక అంతరిక్ష పరిశోధనలు, సాంకేతిక అభివృద్ధి, వ్యూహాత్మక ప్రయోగాలు,

అసెంబ్లీ తర్వాత కేసీఆర్

# ప్రజా ఉద్యమం

● కాంగ్రెస్ ప్రభుత్వ వైఖరికి నిరసనగా కేసీఆర్ భారీ ఉద్యమం ● కాళేశ్వరం, పాలమూరు ప్రాజెక్టులపై నిర్లక్ష్యమే ప్రధాన కారణమన్న హరీశ్ రావు ● సీఎం రేవంత్ భాష వల్లే కేసీఆర్ సభకు రావట్లేదన్న వెల్లడి ● అసెంబ్లీ లోపల, బయట సర్కారును నిలదీయాలని బీఆర్ఎస్ నిర్ణయం ● ముందు రేవంత్ రాజీనామా చేయాలని డిమాండ్



తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రత్యక్ష పోరాటానికి బీఆర్ఎస్ పార్టీ సిద్ధమైంది. సోమవారం ప్రారంభం కానున్న అసెంబ్లీ సమావేశాల తర్వాత, కాళేశ్వరం, పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకాలపై ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరిని నిరసిస్తూ బీఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ నేరుగా భారీ ప్రజా ఉద్యమాన్ని ప్రారంభించనున్నారని పార్టీ ప్రకటించింది.

# పీసీబీపై తీవ్ర విమర్శలు

- లార్డ్స్ టెస్టు వివాదంపై పీసీబీని తప్పుబట్టిన ఇమ్రాన్ ఖాన్ కుమారులు
- తమ ఇంటర్వ్యూ ప్రసారం ఆపాలని పీసీబీ బెదిరించిందన్న ఆరోపణ
- పీసీబీ తమను తాము ఫూల్స్‌గా మార్చుకుందని ఘాటు వ్యాఖ్య
- జైల్లో ఇమ్రాన్‌ను నెమ్మదిగా చంపేయాలని చూస్తున్నారన్న సంచలన ఆరోపణ
- తండ్రి ఆరోగ్య పరిస్థితిపై తీవ్ర ఆందోళన వ్యక్తం చేసిన సులేమాన్, ఖాసిం



# ఢిల్లీలో ఘోర ప్రమాదం

● ఢిల్లీలోని సత్య నికేతన్‌లో ఘోర ప్రమాదం ● ఈ ప్రమాదంలో ముగ్గురు మరణించగా, పలువురిని కాపాడిన సహాయక బృందాలు ● మరమ్మతు పనులు చేస్తుండగా పాత భవనం కూలిపోయినట్లు వెల్లడి ● ప్రభుత్వ నిర్లక్ష్యంపై విపక్షాలు ఆగ్రహం, ఉన్నతస్థాయి విచారణకు డిమాండ్ ● శిథిలాల కింద పలువురు విద్యార్థులు చిక్కుకున్నట్లు అనుమానాలు



# ట్రాన్స్‌జెండర్ల వసూళ్లపై డీజీపీ సీరియస్

ప్రభుత్వ ప్రోత్సాహంతో పలువురు ట్రాన్స్‌జెండర్లు మంచి పేరు తెచ్చుకున్నారని ప్రశంస

- ట్రాన్స్‌జెండర్ల బలవంతపు వసూళ్లపై స్పెషల్ డ్రైవ్‌కు డీజీపీ ఆదేశం
- గతంలోనూ ఇలాంటి దందాలను అరికట్టామని వెల్లడి
- చింతల్‌లో గృహప్రవేశం వద్ద రూ. 50 వేలు డిమాండ్ చేసిన ఘటన వైరల్
- అన్ని కమిషనరేట్ల పరిధిలో తనిఖీలు చేపట్టాలని పోలీసులకు సూచన



కొందరు ట్రాన్స్‌జెండర్లు శుభకార్యాల వద్ద బలవంతంగా డబ్బులు వసూలు చేస్తున్న ఘటనలపై తెలంగాణ డీజీపీ సీవీ ఆనంద్ తీవ్రంగా స్పందించారు. ఇలాంటి బెదిరింపులు, దోపిడీలను అరికట్టేందుకు రాష్ట్రవ్యాప్తంగా మరోసారి ప్రత్యేక డ్రైవ్ (స్పెషల్ డ్రైవ్) చేపట్టాలని అన్ని కమిషనరేట్ల

పెద్దారెడ్డికి

# జేసీ సవాల్

● తాడిపత్రిలో మరోసారి వేడెక్కిన రాజకీయం

● వచ్చే ఎన్నికలకు ఇప్పటి నుంచే సిద్ధం కావాలని పెద్దారెడ్డికి జేసీ సవాల్ ● చెరో రూ. 10 కోట్లు తాడిపత్రి అభివృద్ధికి ఖర్చు చేద్దామని ప్రతిపాదన



అనంతపురం జిల్లా తాడిపత్రి రాజకీయాల్లో మరోసారి తీవ్ర ఉత్కంఠ నెలకొంది. వైసీపీ మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి లక్ష్యంగా టీడీపీ నేత జేసీ ప్రభాకర్ రెడ్డి సంచలన వ్యాఖ్యలు

వసంత్ కుమార్ కుటుంబాన్ని

# పరామర్శించిన లోకేశ్

- ఇటీవల టీడీపీ నేత చెరుకూరి వసంత్ కుమార్ మృతి
- చిత్తూరు జిల్లా పెద్దకాల్వ గ్రామంలో లోకేశ్ పర్యటన
- వసంత్ కుమార్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు
- పార్టీకి ఆయన సేవలను గుర్తు చేసుకున్న లోకేశ్
- కుటుంబానికి అన్ని విధాలా అండగా ఉంటామని హామీ



రాష్ట్ర మంత్రి, తెలుగుదేశం పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ నారా లోకేశ్ చిత్తూరు జిల్లాలో పర్యటించారు. ఇటీవల కన్నుమూసిన టీడీపీ సీనియర్ నేత చెరుకూరి వసంత్ కుమార్ కుటుంబాన్ని ఆయన పరామర్శించారు. గంగాధర నెల్లూరు మండలం పెద్దకాల్వ గ్రామంలోని వసంత్ కుమార్ నివాసానికి వెళ్లిన లోకేశ్, ఆయన కుటుంబ సభ్యులను ఓదార్చారు.

# 2040 వరకు

## తెలంగాణలో కాంగ్రెస్‌దే అధికారం

- కాంగ్రెస్, బీఆర్ఎస్ పాలన మధ్య తేడాపై చర్చకు సిద్ధమన్న మహేశ్ గౌడ్
- కేటీఆర్ సోషల్ మీడియాలో క్షణికానందం పొందుతున్నారని ఎద్దేవా
- తెలంగాణ మట్టిలో బీఆర్ఎస్ అనే మొక్క వాడిపోయిందని వ్యాఖ్య


తెలంగాణ ప్రజల ఆకాంక్షలైన నీళ్లు, నిధులు, నియామకాల కోసమే తాము పోరాటాలు చేశామని టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ స్పష్టం చేశారు. కేసీఆర్ రాజీనామా చేయాలంటూ



## డీజీపీని ఉద్దేశిస్తూ ఘాటు వ్యాఖ్యలు చేసిన కవిత

- కవితపై సోషల్ మీడియాలో అనుచిత వ్యాఖ్యలు చేసిన కానిస్టేబుల్
- కేవలం సస్పెండ్ చేసి సరిపెట్టారని కవిత మండిపాటు
- కఠిన చర్యలు తీసుకోకపోతే ప్రభుత్వ పరువు తీస్తానని హెచ్చరిక

మిగతాది 2లో



# 2040 వరకు తెలంగాణలో కాంగ్రెస్‌దే అధికారం: మహేశ్ గౌడ్

తెలంగాణ ప్రజల ఆకాంక్షలైన నీళ్లు, నిధులు,



నియామకాల కోసమే తాము పోరాటాలు చేశామని టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ స్పష్టం చేశారు. కేసీఆర్ రాజీనామా చేయాలంటూ హైదరాబాద్‌లోని ఇందిరాపార్క్ ధర్నాచౌక్ వద్ద కాంగ్రెస్ పార్టీ నిర్వహించిన మహాధర్నాలో మాట్లాడిన ఆయన, వెయ్యి రోజుల కాంగ్రెస్ పాలనకు, పదేళ్ల బీఆర్ఎస్ దుర్మార్గానికి మధ్య తేడాపై ఎక్కడైనా బహిరంగ చర్చకు తాము సిద్ధంగా ఉన్నామని, బీఆర్ఎస్ నాయకులకు ఆ సవాల్‌ను స్వీకరించే ధైర్యం ఉందా? అని నిలదీశారు. గతంలో కేసీఆర్ చేసిన కొండంత అప్పులను మోస్తూనే తమ ప్రభుత్వం పేదల సంక్షేమానికి పెద్దపీట వేస్తోందని, దేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా నిరుపేదలకు సన్నబియ్యం పంపిణీ చేస్తున్నామని గుర్తుచేశారు.

కేటీఆర్ కేవలం సోషల్ మీడియాకే పరిమితమై క్షణికానందం పొందుతున్నారని, ఆయన చదువుకున్నప్పటికీ సంస్కారం లేని రీతిలో ప్రవర్తిస్తున్నారని మహేశ్ గౌడ్ దుయ్యబట్టారు. తెలంగాణ సంస్కృతిని కాపాడుతూ గద్దర్, అందెశ్రీ, పూలే, సర్దార్ సర్వాయి పాపన్న వంటి మహనీయులను గౌరవించిన ఘనత కాంగ్రెస్‌దేనని తెలిపారు. కేసీఆర్ తన కొడుకు, అల్లుడి రాజకీయ ప్రయోజనాల కోసం ఫామ్‌హౌస్‌కే పరిమితమయ్యారని, అసెంబ్లీకి వచ్చి ప్రజా సమస్యలపై మాట్లాడటంలో ఘోరంగా విఫలమయ్యారని విమర్శించారు. కేసీఆర్ చేతకాకపోతే రాజీనామా చేసి తప్పుకోవాలని హితవు పలికారు.

రాష్ట్రాన్ని దశాబ్దాల పాటు ఏలే శక్తి కాంగ్రెస్‌కు ఉందని, తెలంగాణలో 2040 వరకు తమ ప్రభుత్వమే అధికారంలో ఉంటుందని తేల్చిచెప్పారు. తెలంగాణ మట్టిలో బీఆర్ఎస్ అనే మొక్క ఇప్పటికే వాడిపోయిందని, బీజేపీ అనే మొక్క అసలు మొలకెత్తనే మొలకెత్తదని ఆయన ఎద్దేవా చేశారు.

# పీసీబీపై తీవ్ర విమర్శలు

పాకిస్థాన్ మాజీ ప్రధాని, క్రికెట్ దిగ్గజం ఇమ్రాన్ ఖాన్ కుమారులు సులేమాన్, ఖాసిం.. పాకిస్థాన్ క్రికెట్ బోర్డు (పీసీబీ)పై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. ఇటీవల ఇంగ్లండ్‌తో జరిగిన లార్డ్స్ టెస్టు సందర్భంగా పీసీబీ వ్యవహరించిన తీరును తప్పుబడుతూ, వారు తమను తాము ఫూల్స్‌గా మార్చుకున్నారని ఘాటుగా విమర్శించారు. ఇంగ్లండ్‌తో జరిగిన రెండో టెస్టు మొదటి రోజు, స్కై స్పోర్ట్స్ ఛానెల్‌లో ఇమ్రాన్ కుమారులు సులేమాన్, ఖాసింల ఇంటర్వ్యూ ప్రసారమైంది. మాజీ ఇంగ్లండ్ కెప్టెన్ మైఖేల్ అథర్టన్ నిర్వహించిన ఈ ఇంటర్వ్యూలో, వారు జైల్లో ఉన్న తమ తండ్రి క్షీణిస్తున్న ఆరోగ్యం, జైలు పరిస్థితులపై మాట్లాడారు. ఈ ఇంటర్వ్యూ ప్రసారాన్ని నిలిపివేయకపోతే లంచ్ విరామం తర్వాత బరిలోకి దిగబోమని పీసీబీ బెదిరించినట్లు వార్తలు వచ్చాయి. ఈ వివాదంపైనే ఇమ్రాన్ కుమారులు స్పందించారు. "వారు (పీసీబీ) తమను తాము పూర్తిగా ఫూల్స్‌గా మార్చుకున్నారు" అని ఖాసిం వ్యాఖ్యానించారు. పీసీబీ స్పందన చూసి షాక్‌కు గురయ్యానని సులేమాన్ అన్నారు. "మా ఇంటర్వ్యూను తొలగించాలని పీసీబీ కోరడం వారి పరిధిలో లేదు. మేం మాట్లాడింది రాజకీయాల గురించి కాదు, మానవతా దృక్పథంతో ఆయన ఆరోగ్యం గురించే" అని సులేమాన్ వివరించారు. పీసీబీ ఛైర్మన్ మొహ్సిన్ నఖ్వీ, పాకిస్థాన్ అంతర్గత వ్యవహారాల మంత్రిగా కూడా బాధ్యతలు నిర్వర్తిస్తున్న నేపథ్యంలో, ఇమ్రాన్ భద్రతపై ఆయన కుమారులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. "జైల్లోనే ఆయన్ను చంపేయాలని వారు స్పష్టంగా చూస్తున్నారు. వీలైనంత రహస్యంగా ఆయన్ను నిశ్శబ్దం చేసి, నెమ్మదిగా కనుమరుగు చేయాలని ప్రయత్నిస్తున్నారు" అని వారు సంచలన ఆరోపణలు చేశారు. అయితే, ఇమ్రాన్ ఖాన్‌కు పూర్తి వైద్య సంరక్షణ అందిస్తున్నామని, ఆయనపై దుష్ప్రవర్తన ఆరోపణలను పాకిస్థాన్ అధికారులు ఖండిస్తూ వస్తున్నారు. ఈ వాదనలను సులేమాన్ తోసిపుచ్చారు. "ప్రభుత్వ వర్గాలు చెప్పే మాటల్లో పారదర్శకత లేదు. మాకు ఎలాంటి ఆధారాలు చూపించడం లేదు. అలాంటప్పుడు మేం ఎలా నమ్మాలి? ఆరు నెలల క్రితం తన కంటి సమస్య గురించి ఆయనే స్వయంగా మాట్లాడారు. ఆ తర్వాత ఆయన ఆరోగ్యంపై మాకు ఎలాంటి స్పష్టమైన సమాచారం లేదు" అని సులేమాన్ ఆవేదన వ్యక్తం చేశారు.

# ప్రైవేటీకరణ అంటూ కథనాలు.. క్లారిటీ ఇచ్చిన ఇస్రో

ఇస్రో భవిష్యత్ పాత్రపై కొన్ని మీడియా సంస్థలు అసత్యాలు, తప్పుడు సమాచారాన్ని ప్రచారం



చేస్తున్నాయని, ఈ కథనాలు పూర్తిగా నిరాధారమైనవని ఇస్రో పేర్కొంది. "ఇస్రోను ప్రైవేటీకరించరు, దాని ప్రాముఖ్యాన్ని తగ్గించరు. అత్యాధునిక అంతరిక్ష పరిశోధనలు, సాంకేతిక అభివృద్ధి, వ్యూహాత్మక ప్రయోగాలు, అంతరిక్ష విజ్ఞానం, అన్వేషణ వంటి కీలక రంగాలలో ఇస్రో దేశానికి ప్రధాన సంస్థగా కొనసాగుతుంది" అని ఆ ప్రకటనలో తేల్చిచెప్పింది.

అంతరిక్ష రంగంలో ప్రైవేట్ భాగస్వామ్యాన్ని ప్రోత్సహించడం వెనుక ఉద్దేశం ఇస్రో పాత్రను తగ్గించడం కాదని, మరింత ఉన్నతమైన లక్ష్యాలపై దృష్టి సారించేలా చేయడమేనని వివరించింది. 2020లో ప్రారంభమైన సంస్కరణలు, 2023 భారత అంతరిక్ష విధానం ద్వారా దేశంలో బలమైన, ప్రపంచంతో పోటీపడగల అంతరిక్ష పర్యావరణ వ్యవస్థను నిర్మించడమే లక్ష్యమని తెలిపింది. దీనివల్ల ఇస్రో ప్రాధాన్యం తగ్గదని, భారత అంతరిక్ష పర్యావరణ వ్యవస్థ స్వరూపం, సామర్థ్యం విస్తరిస్తాయని పేర్కొంది. సాంకేతికంగా అభివృద్ధి చెందిన, పునరావృతమయ్యే పనులను పరిశ్రమలకు అప్పగించడం ద్వారా ఇస్రో శాస్త్రవేత్తలు, సిబ్బంది తమ సమయాన్ని అధునాతన పరిశోధనలు (ఆర్ అండ్ డీ), కొత్త తరం టెక్నాలజీలు, సంక్లిష్టమైన జాతీయ ప్రాజెక్టులపై కేంద్రీకరించగలరని ఇస్రో తెలిపింది. ఇది "ఇస్రో నేతృత్వంలోని జాతీయ అంతరిక్ష పర్యావరణ వ్యవస్థ"కు నాంది పలుకుతుందని వివరించింది.

**భవిష్యత్ లక్ష్యాలు ఇవే..**

భవిష్యత్తులో ఇస్రో పాత్ర మరింత బలోపేతం కానుంది. ముఖ్యంగా, మానవసహిత అంతరిక్ష యాత్రలు (గగన్‌యాన్), కొత్త తరం ప్రయోగ వాహనాలు, చంద్రుడు, ఇతర గ్రహాలపై పరిశోధనలు, 2035 నాటికి 'భారతీయ అంతరిక్ష్ స్టేషన్' ఏర్పాటు, 2040 నాటికి చంద్రుడిపైకి భారతీయుడిని పంపడం వంటి భారీ లక్ష్యాలపై ఇస్రో దృష్టి పెడుతుంది.

ప్రస్తుతం 8.4 బిలియన్ డాలర్లుగా ఉన్న భారత అంతరిక్ష ఆర్థిక వ్యవస్థను 2033 నాటికి 44 బిలియన్ డాలర్లకు పెంచడమే లక్ష్యం. ఈ స్థాయి వృద్ధిని కేవలం ప్రభుత్వ వనరులతో సాధించడం అసాధ్యమని, దీనికి ప్రైవేట్ పెట్టుబడులు, పారిశ్రామిక సామర్థ్యం, ప్రపంచ మార్కెట్ అవసరమని ఇస్రో స్పష్టం చేసింది. 2020లో కొన్ని మాత్రమే ఉన్న స్పేస్ స్టార్టప్‌లు, నేడు 450కి పైగా పెరగడమే ఈ సంస్కరణల విజయానికి నిదర్శనమని పేర్కొంది.

# అసెంబ్లీ తర్వాత కేసీఆర్ ప్రజా ఉద్యమం

ఆదివారం ఎర్రవల్లిలోని ఫామ్‌హౌస్‌లో కేసీఆర్ అధ్యక్షతన జరిగిన బీఆర్ఎస్ శాసనసభాపక్ష సమావేశంలో ఈ కీలక నిర్ణయం తీసుకున్నారు. సమావేశం అనంతరం వివరాలను అసెంబ్లీలో బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్ రావు మీడియాకు వెల్లడించారు. కాళేశ్వరం ప్రాజెక్టులో నీళు అందుబాటులో ఉన్నప్పటికీ, కాంగ్రెస్ ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగానే నీటిని ఎత్తిపోయకుండా రైతులను ఇబ్బందులకు గురిచేస్తోందని ఆయన ఆరోపించారు. తమ ప్రభుత్వం 80 శాతం పూర్తి చేసిన పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టు మిగిలిన పనులు పూర్తిచేస్తే 60 టీఎంసీల నీరు అందుబాటులోకి వస్తుందని, కానీ కాంగ్రెస్ సర్కారు కక్షపూరితంగా దాన్ని పక్కనపెట్టిందని విమర్శించారు.

"ఈ రెండు ప్రాజెక్టుల విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వ నిర్లక్ష్యానికి నిరసనగా, రాబోయే రోజుల్లో స్వయంగా కేసీఆర్ లక్షలాది మందితో ప్రత్యక్ష ప్రజా ఉద్యమానికి నాయకత్వం వహించాలని ఈ సమావేశంలో నిర్ణయించాం" అని హరీశ్ రావు తెలిపారు. అసెంబ్లీలోనూ ప్రభుత్వాన్ని పలు అంశాలపై నిలదీస్తామని హరీశ్ రావు స్పష్టం చేశారు. సెక్షన్ 22ఏ కింద భూములను 'నిషేధిత జాబితా'లో చేర్చి రైతులను వేధించడం, విద్యుత్ కోతలు, రుణమాఫీ వైఫల్యం, పాలిటెక్నిక్ జీవో 97 రద్దు, సింగరేణి కుంభకోణాలు, పీఆర్సీ, డీఏలు, ఈహెచ్ఎస్ అమలులో వైఫల్యాలపై ప్రభుత్వాన్ని గట్టిగా ప్రశ్నిస్తామన్నారు.

అసెంబ్లీకి కేసీఆర్ హాజరుకాకపోవడంపై కాంగ్రెస్ చేస్తున్న విమర్శలను హరీశ్ రావు తిప్పికొట్టారు. "ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వాడే వీధి స్థాయి భాషను వినడానికి కేసీఆర్ అసెంబ్లీకి రావాల్సిన అవసరం లేదు" అని ఆయన వ్యాఖ్యానించారు. గతంలో ఎన్టీఆర్, జయలలిత, చంద్రబాబు వంటి నేతలు శాసనసభలో అవమానాలకు గురైనప్పుడు సభను బహిష్కరించి, ప్రజా తీర్పుతో తిరిగి ముఖ్యమంత్రులుగా వచ్చారని, కేసీఆర్ కూడా అదే మార్గంలో పయనిస్తున్నారని అన్నారు. ప్రతిపక్ష నేత భద్రత ఖర్చుపై మాట్లాడే సీఎం రేవంత్ రెడ్డి, కనీసం వార్డు మెంబర్‌గా కూడా లేని తన సోదరుడు తిరుపతి రెడ్డికి నలుగురు గన్‌మెన్లను పెట్టి రూ.40 కోట్లు ఖర్చు చేస్తున్నారని హరీశ్ రావు ఆరోపించారు. 30 లక్షల మంది విద్యార్థులకు సంబంధించిన ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిల అంశాన్ని కూడా సభలో ప్రస్తావిస్తామన్నారు. ప్రజా సమస్యలపై సమగ్ర చర్చకు వీలుగా అసెంబ్లీ సమావేశాలను నెల రోజుల పాటు నిర్వహించాలని డిమాండ్ చేశారు. కేసీఆర్ రాజీనామా చేయాలన్న కాంగ్రెస్ డిమాండ్‌పై స్పందిస్తూ.. 'ఆరు గ్యారెంటీలు', రుణమాఫీ హామీని నిలబెట్టుకోనందుకు ముందుగా సీఎం రేవంత్ రెడ్డి రాజీనామా చేయాలని హరీశ్ రావు డిమాండ్ చేశారు. పాలన చేతగాక, ప్రజల నుంచి తీవ్ర వ్యతిరేకత ఎదురవుతుండటంతోనే.. కేసీఆర్ రాజీనామా అంశాన్ని తెరపైకి తెచ్చి ప్రజల దృష్టిని మళ్లిస్తున్నారని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం 1000 రోజుల పాలన పూర్తి చేసుకున్నా.. విద్యార్థులు, నిరుద్యోగులు, రైతులు, మహిళలు, దళిత, గిరిజన, బీసీ వర్గాలను దారుణంగా మోసం చేసిందని విమర్శించారు.

# ట్రాన్స్‌జెండర్ల వసూళ్లపై డీజీపీ సీరియస్

(మొదటి పేజీ తరువాయి)

ఘటనలపై తెలంగాణ డీజీపీ సీవీ ఆనంద్ తీవ్రంగా స్పందించారు. ఇలాంటి బెదిరింపులు, దోపిడీలను అరికట్టేందుకు రాష్ట్రవ్యాప్తంగా మరోసారి ప్రత్యేక డ్రైవ్ (స్పెషల్ డ్రైవ్) చేపట్టాలని అన్ని కమిషనరేట్ల సీపీలను ఆదేశించనున్నట్లు ఆయన స్పష్టం చేశారు. ఇటీవల హైదరాబాద్‌లోని చింతల్‌లో ఓ గృహప్రవేశ వేడుకలో ట్రాన్స్‌జెండర్లు రూ. 50,000 డిమాండ్ చేసిన ఘటన సోషల్ మీడియాలో వైరల్ అయిన నేపథ్యంలో డీజీపీ ఈ ప్రకటన చేయడం ప్రాధాన్యం సంతరించుకుంది. సెప్టెంబర్ 4న చింతల్ ప్రాంతంలో ఓ కుటుంబం తమ నూతన గృహంలోకి ప్రవేశించేందుకు రాగా, కొందరు ట్రాన్స్‌జెండర్లు వారిని అడ్డుకున్నారు. ఇంట్లోకి వెళ్లాలంటే రూ. 50,000 ఇవ్వాల్సిందేనని పట్టుబట్టారు. అంత మొత్తం ఇచ్చుకోలేమని బాధితులు చెప్పినా వినకుండా అసభ్యంగా ప్రవర్తించి, శాపనార్థాలు పెట్టారని బాధితురాలు వీడియో ద్వారా ఆవేదన వ్యక్తం చేశారు. ఈ వీడియో సామాజిక మాధ్యమాల్లో విస్తృతంగా వ్యాపించడంతో, ఇలాంటి వసూళ్ల దందాలపై కఠిన చర్యలు తీసుకోవాలని నెటిజన్లు పోలీసులను కోరారు. ఈ ఘటనపై స్పందించిన డీజీపీ సీవీ ఆనంద్, ఇటీవల కాలంలో ఇలాంటి ఫిర్యాదులు తన దృష్టికి వస్తున్నాయని అంగీకరించారు. తాను హైదరాబాద్ సీపీగా ఉన్నప్పుడు కూడా ఇలాంటి బెగ్గింగ్ రాకెట్లు, బలవంతపు వసూళ్లపై ప్రత్యేక డ్రైవ్ చేపట్టి నియంత్రించినట్లు గుర్తుచేశారు. ఇప్పుడు మళ్లీ అదే తరహా చర్యలు తీసుకుంటామని ఆయన హామీ ఇచ్చారు. అదే సమయంలో, ట్రాన్స్‌జెండర్ల జీవనోపాధికి తెలంగాణ ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహాన్ని డీజీపీ ప్రస్తావించారు. ప్రభుత్వ చొరవతో ఎందరో ట్రాన్స్‌జెండర్లు ట్రాఫిక్ అసిస్టెంట్లుగా, ఇతర విభాగాల్లో ఉద్యోగాలు పొంది ఎలాంటి ఫిర్యాదులు లేకుండా మంచి పేరు తెచ్చుకుంటున్నారని ఆయన వివరించారు.

## డీజీపీని ఉద్దేశిస్తూ ఘాటు వ్యాఖ్యలు చేసిన కవిత

(మొదటి పేజీ తరువాయి)

తనపై సోషల్ మీడియాలో అనుచిత వ్యాఖ్యలు చేసిన కానిస్టేబుల్‌ను కేవలం సస్పెండ్ చేసి సరిపెట్టారంటూ తెలంగాణ రక్షణ సేన అధినేత్రి కల్వకుంట్ల కవిత తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. మహిళలను దూషిస్తే మూడేళ్ల జైలు శిక్ష పడే చట్టాలు ఉన్నప్పటికీ పోలీసు యంత్రాంగం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తోందని, సదరు కానిస్టేబుల్‌పై కఠిన చర్యలు తీసుకోకపోతే అంతర్జాతీయ స్థాయిలో ఈ ప్రభుత్వ పరువు తీస్తానని హెచ్చరించారు. బంజారాహిల్స్‌లోని పార్టీ కార్యాలయంలో మీడియాతో మాట్లాడిన కవిత, "డీజీపీ గారికి ఇద్దరు కోడళ్లు ఉన్నారు. వారిపై ఇలాగే కామెంట్లు చేస్తే ఊరుకుంటారా? నాలాంటి ప్రజాప్రతినిధికే రక్షణ లేకపోతే సాధారణ మహిళల పరిస్థితి ఏమిటి?" అని ప్రశ్నించారు. రాష్ట్రంలో ఈ డీజీపీ బాధ్యతలు స్వీకరించాకే క్రైమ్ రేటు పెరిగిందని, గంజాయి విక్రయాలపై సిగ్గుచేటు వ్యాఖ్యలు చేస్తున్నారని మండిపడ్డారు. ఎన్నికలకు ముందు తెలంగాణ ఉద్యమకారుల కాళ్లు పట్టుకున్న రేవంత్ రెడ్డి, అధికారంలోకి వచ్చాక మూడేళ్ల పాలనలో వారిని పూర్తిగా విస్మరించారని కవిత ధ్వజమెత్తారు. ఉద్యమకారుల్లో ఉన్న నమ్మకాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం వమ్ము చేసిందని, ఇక మిగిలింది ఆమరణ దీక్ష మాత్రమేనని స్పష్టం చేశారు. రాబోయే అసెంబ్లీ సమావేశాల్లోనే ఉద్యమకారుల సంక్షేమంపై స్పష్టమైన గడువుతో కూడిన హామీ ఇవ్వాలని డిమాండ్ చేశారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు ఇస్తామని తప్పుడు లెక్కలు చూపిన కాంగ్రెస్, ఇప్పుడు బీసీల కోసం ధర్నాలు చేయడం హాస్యాస్పదంగా ఉందన్నారు.

# పెద్దారెడ్డికి జేసీ సవాల్

(మొదటి పేజీ తరువాయి)

కేతిరెడ్డి పెద్దారెడ్డి లక్ష్యంగా టీడీపీ నేత జేసీ ప్రభాకర్ రెడ్డి సంచలన వ్యాఖ్యలు చేస్తూ సవాల్ విసిరారు. వచ్చే ఎన్నికలకు ఇప్పటినుంచే సిద్ధం కావాలని హెచ్చరించిన ఆయన... గత ఐదేళ్ల వైసీపీ పాలనలో తాడిపత్రిలో మట్కా, బెట్టింగ్, గంజాయి దందాలు విచ్చలవిడిగా సాగాయని ఆరోపించారు. బీఎస్-3 వాహనాల కుంభకోణంతో పాటు అక్రమ సంపాదనకు అలవాటు పడి తాడిపత్రి ప్రాంత అభివృద్ధిని కేతిరెడ్డి పూర్తిగా నాశనం చేశారని తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ఈ విమర్శలతో పాటు జేసీ ప్రభాకర్ రెడ్డి ఓ ఆసక్తికరమైన సవాల్‌ను కేతిరెడ్డి ముందుంచారు. రాబోయే ఎన్నికల్లో ఓటర్లకు పైసలు పంచే సంస్కృతికి స్వస్తి పలికి, ఇద్దరం చెరో రూ. 10 కోట్ల చొప్పున మొత్తం రూ. 20 కోట్లు తీసి తాడిపత్రి పట్టణాభివృద్ధికి ఖర్చు చేద్దామని ప్రతిపాదించారు. "నా సవాల్‌ను స్వీకరించే ధైర్యం, తాడిపత్రిపై నిజమైన ప్రేమ నీకు ఉందా పెద్దారెడ్డి?" అని సూటిగా ప్రశ్నించారు. ద

## వసంత్ కుమార్ కుటుంబాన్ని పరామర్శించిన లోకేశ్

(మొదటి పేజీ తరువాయి)



ఈ సందర్భంగా వసంత్ కుమార్ చిత్రపటానికి లోకేశ్ పూలమాల వేసి శ్రద్ధాంజలి ఘటించారు. పార్టీకి ఆయన అందించిన సేవలను స్మరించుకున్నారు. కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేసిన లోకేశ్, వారికి పార్టీ అన్ని విధాలా అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ఈ పర్యటనకు సంబంధించిన వివరాలను, ఫొటోలను నారా లోకేశ్ తన సోషల్ మీడియా ఖాతాలో పంచుకున్నారు.

# హైదరాబాద్‌లో 'అహింసా స్థూపం'..

(మొదటి పేజీ తరువాయి)

హైదరాబాద్‌లోని మియాపూర్‌లో 'అహింసా స్థూపం' ఆవిష్కరించారు. శాంతి, అహింస అనే గొప్ప సందేశాన్ని సమాజంలో మరింత బలంగా చాటిచెప్పేందుకు ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కిషన్ రెడ్డి మాట్లాడుతూ, ఇది కేవలం ఒక కట్టడం ఆవిష్కరణ కాదని, శాంతి, అహింస వంటి కాలాతీతమైన సిద్ధాంతాలను పరిరక్షించి, భవిష్యత్ తరాలకు అందించే గొప్ప ప్రయత్నమని స్పష్టం చేశారు. భగవాన్ మహావీరుడి సందేశమైన 'పరస్పరోపగ్రహో జీవానామ్' అనే సూక్తికున్న ప్రాధాన్యతను ఆయన వివరించారు. 'జీవులన్నీ పరస్పర మద్దతు, సహకారంతో ముడిపడి ఉంటాయి' అని దీని అర్థమని, ఈ సూక్తిని స్థూపంపై చెక్కారని తెలిపారు. ప్రపంచంలోని అనేక ప్రాంతాల్లో హింస, ఘర్షణలు కొనసాగుతున్న తరుణంలో పరస్పర గౌరవం, శాంతియుత సహజీవనం అనే సందేశం ఎంతో అవసరమని ఆయన నొక్కిచెప్పారు.

# ఢిల్లీలో కుప్పకూలిన ఐదంతస్తుల భవనం.. ముగ్గురి మృతి



దేశ రాజధాని ఢిల్లీలో ఆదివారం ఘోర ప్రమాదం చోటుచేసుకుంది. సౌత్ ఢిల్లీలోని సత్య నికేతన్ ప్రాంతంలో మరమ్మతు పనులు జరుపుకుంటున్న ఐదంతస్తుల భవనం ఒక్కసారిగా కుప్పకూలింది. ఈ దుర్ఘటనలో ముగ్గురు మృతి చెందగా, ఇప్పటివరకు ఆరుగురిని సహాయక బృందాలు సురక్షితంగా వెలికితీశాయి. శిథిలాల కింద మరికొంతమంది చిక్కుకుని ఉండవచ్చని అధికారులు అనుమానిస్తున్నారు. ఈ ఘటనపై తీవ్ర విచారం వ్యక్తం చేసిన కాంగ్రెస్, ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) ఉన్నతస్థాయి విచారణ జరిపి, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశాయి. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం, కూలిపోయిన భవనం సుమారు 40-50 ఏళ్ల నాటిది. బేస్‌మెంట్‌తో కలిపి మొత్తం ఐదు అంతస్తులున్న ఈ భవనాన్ని పేయింగ్ గెస్ట్ (పీజీ) వసతి గృహంగా ఉపయోగిస్తున్నారు. ప్రమాదం జరిగిన సమయంలో బేస్‌మెంట్‌లో మరమ్మతు పనులు జరుగుతున్నాయి. శిథిలాల కింద నుంచి వెలికితీసిన ఒక వ్యక్తిని ఎయిమ్స్ ట్రామా సెంటర్‌కు తరలించగా, అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. ఈ ఘటనపై కాంగ్రెస్ ఎంపీ దీపేందర్ సింగ్ హుడా మాట్లాడుతూ, ఇది రాజకీయ విమర్శలు చేసే సమయం కానప్పటికీ, జవాబుదారీతనం ఎక్కడ అని ప్రశ్నించారు. "ఈ ప్రాంతంలో పీజీలు ఏ పరిస్థితుల్లో నడుస్తున్నాయో అందరికీ తెలుసు. వాటికి లేఅవుట్ ప్లాన్లను ఎవరు మంజూరు చేస్తున్నారు? అగ్నిమాపక భద్రతను ఎవరు ధ్రువీకరిస్తున్నారు? మున్సిపల్ కార్పొరేషన్, ప్రభుత్వం, స్థానిక ఎమ్మెల్యేల పాత్ర ఏమిటి? ఎవరో ఒకరు బాధ్యత వహించాలి" అని ఆయన నిలదీశారు. విద్యార్థులే శిథిలాల నుంచి ముగ్గురిని బయటకు లాగారని, ప్రభుత్వం దీనికి సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ఆప్ కన్వీనర్, ఢిల్లీ మాజీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ ఈ ఘటనను అత్యంత విషాదకరమని అభివర్ణించారు. "ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా ఢిల్లీలో ఇలాంటి ప్రమాదాలు తరచూ జరుగుతున్నాయి. ప్రభుత్వం ఇకనైనా నిద్రమత్తు వీడి పౌరుల భద్రతకు చర్యలు తీసుకోవాలి" అని ఆయన 'ఎక్స్'లో పోస్ట్ చేశారు. ఢిల్లీ అసెంబ్లీ ప్రతిపక్ష నేత, మాజీ సీఎం అతిషి కూడా ఈ ఘటనపై ఉన్నతస్థాయి విచారణకు డిమాండ్ చేశారు. నిర్లక్ష్యానికి కారణమైన వారిపై కఠిన చర్యలు తీసుకుంటేనే భవిష్యత్తులో ఇలాంటివి పునరావృతం కావని ఆమె పేర్కొన్నారు. సమీపంలోనే ప్రచారం చేస్తున్న ఎన్ఎస్‌యూఐ జాతీయ అధ్యక్షుడు వినోద్ జాఖర్, తాము ఘటనాస్థలికి చేరుకుని ముగ్గురిని కాపాడామని తెలిపారు. ప్రమాద స్థలంలో విద్యార్థులకు చెందిన పుస్తకాలు కనిపించాయని, ప్రభుత్వ వైఫల్యమే ఈ దుర్ఘటనకు కారణమని ఆరోపించారు. ప్రమాదం జరిగిన భవనం పక్కనే ఉన్న పీజీలో నివసించే ఓ విద్యార్థి మాట్లాడుతూ, "భోజనం చేశాక ఒక్కసారిగా భూకంపం వచ్చినట్లు భవనం కంపించింది. బాల్కనీలోకి వచ్చి చూస్తే అంతా దుమ్ముతో నిండిపోయింది. కిందకు దిగాక భవనం కూలిందని అర్థమైంది. అధికారుల కంటే ముందే మేం ఒకరిని శిథిలాల నుంచి బయటకు లాగాం" అని తెలిపారు. మరో ప్రత్యక్ష సాక్షి మాట్లాడుతూ, ఇంకా 20-30 మంది శిథిలాల కింద చిక్కుకొని ఉండవచ్చని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుతం సహాయక చర్యలు కొనసాగుతున్నాయి. ఈ ఘటనతో స్థానికంగా భయాందోళనలు నెలకొన్నాయి.

# ప్రజల సమస్యలకు సత్వర పరిష్కారమే లక్ష్యం.

**-07న జిల్లా వ్యాప్తంగా ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పి జి ఆర్ ఎస్)**
**జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి.**



పల్లె వెలుగు నంద్యాల జిల్లా బ్యూరో. జిల్లా ప్రజల సమస్యలను సత్వరంగా పరిష్కరించేందుకు ఈ నెల 07వ తేదీ సోమవారం జిల్లా వ్యాప్తంగా ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పి జి ఆర్ ఎస్) నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా కలెక్టరేట్‌తో పాటు రెవెన్యూ డివిజన్, మండల పరిషత్, మున్సిపల్ కార్యాలయాల్లో ఉదయం 10 గంటల నుంచి ప్రజల నుంచి వినతిపత్రాలను స్వీకరించనున్నట్లు పేర్కొన్నారు. సంబంధిత అధికారులు వినతులను పరిశీలించి, నిబంధనల మేరకు సత్వర పరిష్కారానికి చర్యలు తీసుకుంటారని తెలిపారు. ప్రజలు తమ సమస్యలను ఎవవనెశీయిఎ.ఖజూ.స్త్రశీజ.అఅ ద్వారా ఆన్‌లైన్‌లో కూడా నమోదు చేసుకోవచ్చని, అర్జీల పరిష్కార స్థితిని టోల్‌ఫ్రీ నంబర్ 1100 ద్వారా తెలుసుకోవచ్చని వివరించారు. ముందుగా మండల, రెవెన్యూ డివిజన్ లేదా మున్సిపల్ స్థాయిలో సమస్యలను పరిష్కరించుకోవాలని, అక్కడ పరిష్కారం కాని సమస్యలను జిల్లా స్థాయి పి జి ఆర్ ఎస్ లో సమర్పించాలని కలెక్టర్ సూచించారు. జిల్లా కేంద్రంలోని కార్యక్రమానికి అన్ని శాఖల జిల్లా స్థాయి అధికారులు తప్పనిసరిగా హాజరై ప్రజల వినతులను స్వీకరించాలని ఆదేశించారు.


## ప్రతికూల ఆలోచనలు వద్దు ప్రగతి శీల ఆలోచనలే ముద్దు




పల్లె వెలుగు:యువతర మా మేలుకో నీఆలోచనలే దేశానికి వెలుగు బాటలు సందిగ్ధాల సంకెళ్లను తెంచుకో సరికొత్త చరిత్ర ను సృష్టించి చూపించు.ప్రతికూల ఆలోచనలు ప్రగతికి శాపాలు ప్రగతి శీల భావాలే విజయ సోపానాలు.ఓటములకు లొంగి పోతే లభించదు గమ్యం పోరాడే గుణమే యువతకు అసలైన సైన్యం నిరాశే నిన్ను ఆవహించిన వేళ నీలోని సంకల్పమే ఒక అగ్ని జ్వాల సరిహద్దులు దాటి దూసుకుపో ముందుకు అసాధ్యం లేదులే.నీ మనసులో నర నరాన లక్ష్యసాధన కాంక్ష నిగుడమై ఉంది.లక్ష్య సాధనకై సాగాలి నీ అడుగు నీవే రేపటి తరం వెలుగు సృజనాత్మకత శబ్దమై గర్జించు ఆత్మనిర్భరతకు సారధివై సాగిపో.ప్రగతి శిఖరాగ్రాన నీజెండాను ఎగిరేయి యువత తలిస్తే మారినది ఏదీ లేదు.నీ ప్రగతిశీల ఆలోచనే నవ సమాజానికి పునాది.నేదునూరి కనకయ్య రచయిత కాలమిస్ట్ కరీంనగర్.ద

## కస్తూరిబాలో పోలీసుల అవగాహన సదస్సు

బండి ఆత్మకూరు పల్లె వెలుగు సెప్టెంబర్ 6: బండి ఆత్మకూరులోని కస్తూరిబా మహిళా జూనియర్ కళాశాలలో ఎస్ఐ జగన్మోహన్ ఆదివారం అవగాహన సదస్సును



నిర్వహించారు. సమాజంలో జరుగుతున్న సైబర్ నేరాలు, ఉద్యోగాలు ఇప్పిస్తామని నేరగాళు చేసే మోసాలు, మహిళల పట్ల అసభ్యంగా ప్రవర్తించే వ్యక్తుల ప్రవర్తనల గురించి విద్యార్థినులకు వివరించారు. బాల్య వివాహాలు చేసుకోవడం వల్ల ఏర్పడే ఇబ్బందులు, అనర్థాలను గురించి వివరించారు. కళాశాల పరిసరాల్లో ఎవరైనా అపరిచిత వ్యక్తులు కనిపించినా, ఏదైనా ఇబ్బందులు తలెత్తిన పోలీసులకు వెంటనే సమాచారం అందిస్తే సత్వరమే చర్యలు తీసుకుంటామని ఎస్సై విద్యార్థినులకు వివరించారు. విద్యార్థినిలు చదువు పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించి ఉన్నత స్థాయికి ఎదగాలని ఎస్ఐ వారికి సూచించారు.ద

## నాణ్యత ప్రమాణాలతో కూడిన అభివృద్ధి

**- నిర్దేశిత గడువులోపు పనులు పూర్తి చేయాలి**
**- నగరపాలక సంస్థ కమిషనర్ చల్లా ఓబులేసు**

పల్లె వెలుగు కర్నూలు రిపోర్టర్ : కర్నూలు నగరంలో చేపట్టే అభివృద్ధి పనులను నాణ్యత ప్రమాణాలు పాటిస్తూ, నిర్దేశిత గడువులోపు పనులను పూర్తి చేయాలని నగరపాలక సంస్థ కమిషనర్ చల్లా ఓబులేసు ఆదేశించారు. ఆదివారం ఆయన 23, 24 వార్డుల పరిధిలో ఉన్న సుద్దవాగు రక్షణ గోడ నిర్మాణ పనులను పరిశీలించారు.



ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ నగరంలో వర్షాలు కురిసిన ప్రతిసారి నీటి ప్రవాహం కారణంగా శ్రీరామ్‌నగర్, లక్ష్మీనగర్ ప్రాంతాల్లోని సుద్దవాగు పరిసరాల్లో వరద పరిస్థితులు ఏర్పడి నీరు ఇళ్లలోకి చేరుతుండేదని అన్నారు. ఈ సమస్యకు శాశ్వత పరిష్కారంగా రూ.2.50 కోట్ల వ్యయంతో 250 మీటర్ల మేర రక్షణ గోడ నిర్మాణానికి ప్రభుత్వం చర్యలు చేపట్టినట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో ఎస్ఈ రమణమూర్తి, కాంట్రాక్టర్ మనోహర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

# నంద్యాలలో ఉచిత కృత్రిమ కాలు అందజేతకు కొలతలు.

**42 మందికి రూ.50 వేల విలువైన కృత్రిమ కాళ్లు ఉచితం.**



పల్లె వెలుగు నంద్యాల జిల్లా బ్యూరో. ప్రమాదాలు, అనారోగ్య సమస్యలు, ఇతర కారణాలతో కాళ్లు కోల్పోయి ఇబ్బందులు పడుతున్న నిరుపేదలకు అండగా నిలిచేందుకు నంద్యాలలో ఉచిత కృత్రిమ కాలు అందజేత కార్యక్రమాన్ని నిర్వహించారు.
నంద్యాల ఆయుష్ యోగ కేంద్రంలో ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ, భారత్ వికాస్ పరిషత్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమంలో భాగంగా లబ్ధిదారులకు కృత్రిమ కాళ్ల కొలతలు తీసుకున్నారు.
భారత్ వికాస్ పరిషత్ ఆధ్వర్యంలో ఆనంద్ గురూజీ నేతృత్వంలో నిర్వహించిన ఈ కార్యక్రమాన్ని ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ జిల్లా చైర్మన్ దస్తగిరి, రాష్ట్ర మార్క్‌ఫెడ్ డైరెక్టర్ తులసి రెడ్డి, డాక్టర్ పబ్బు చిరంజీవి ముఖ్య అతిథులుగా హాజరై ప్రారంభించారు.
ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ ప్రమాదాలు, అనారోగ్య సమస్యలు లేదా ఇతర కారణాలతో కాళ్లు కోల్పోయిన వారికి సుమారు రూ.50 వేల విలువైన కృత్రిమ కాలును ఉచితంగా అందజేయడం ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమన్నారు. ఈ సేవను తొలిదశలో 30 మందికి పరిమితంగా అందిస్తున్నట్లు తెలిపారు.
ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ సహకారంతో పాటు డాక్టర్ పబ్బు చిరంజీవి అందిస్తున్న సహకారంతో ఈ సేవా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.
కొలతలు తీసుకున్న లబ్ధిదారులకు త్వరలో తేదీని ప్రకటించి కృత్రిమ కాళ్లను అందజేస్తామని తెలిపారు.
భారత్ వికాస్ పరిషత్ ఆధ్వర్యంలో భవిష్యత్తులో మరిన్ని సేవా కార్యక్రమాలు చేపడతామని ఆనంద్ గురూజీ తెలిపారు.
భారత్ వికాస్ పరిషత్ చేపడుతున్న సేవా కార్యక్రమాలకు ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ తరఫున పూర్తి సహకారం అందిస్తామని జిల్లా చైర్మన్ దస్తగిరి పేర్కొన్నారు.
రాష్ట్ర మార్క్‌ఫెడ్ డైరెక్టర్ తులసి రెడ్డి మాట్లాడుతూ ఆనంద్ గురూజీ నిర్వహిస్తున్న సేవా కార్యక్రమాలకు తన వంతు సహకారం అందిస్తానని తెలిపారు. భవిష్యత్తులో ఎంపీ బైరెడ్డి శబరి సహకారంతో మరిన్ని భారీ సేవా కార్యక్రమాలు నిర్వహించేందుకు కృషి చేస్తామని అన్నారు.
డాక్టర్ పబ్బు చిరంజీవి మాట్లాడుతూ
షేర్ సొసైటీ ట్రస్ట్ సభ్యుల సహకారంతో ఈ క్యాంపును నిర్వహిస్తున్నామని, కృత్రిమ కాలు ద్వారా లబ్ధిదారులు తమ రోజువారీ కార్యకలాపాలను మరింత సులభంగా నిర్వహించుకునే అవకాశం ఉంటుందని వివరించారు.
ఈ కార్యక్రమంలో భారత్ వికాస్ పరిషత్, ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ప్రతినిధులు, ట్రస్ట్ సభ్యులు, లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

# మంత్రి ఎన్ఎండి ఫరూక్ సమక్షంలో భారీగా టీడీపీలోకి చేరికలు.

**-వైసీపీకి వీడ్కోలు పలికి సైకిల్ ఎక్కిన వైఎస్ఆర్సిపి నాయకులు, మాజీ కౌన్సిలర్ జాగటి బాల పక్కీరయ్య గౌడ్ (తిక్కన్న).**

పల్లె వెలుగు నంద్యాల జిల్లా బ్యూరో. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర న్యాయ మరియు మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్ సమక్షంలో నంద్యాల నూనెపల్లి లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కి భారీ ఎదురుదెబ్బ తగిలింది. వైసీపీకి చెందిన మాజీ కౌన్సిలర్ జాగటి బాల పక్కీరయ్య గౌడ్ (తిక్కన్న), వారి సోదరులు, కుమారులు మరియు పెద్ద సంఖ్యలో 500 మంది అనుచరులతో కలిసి







తెలుగుదేశం పార్టీలో చేరారు. మంత్రి ఎన్ఎండి ఫరూక్ వారికి పసుపు కండువాలు కప్పి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. చేరికల కార్యక్రమానికి ముందు నూనెపల్లె జిలేబి సెంటర్ నుంచి మంచినీళ్ల బావి మీదుగా మారుతి నగర్ వరకు టీడీపీ శ్రేణులు, నాయకులు, కార్యకర్తలతో కలిసి భారీ ర్యాలీ నిర్వహించారు. బాణాసంచా పేలుళ్లు, నినాదాల నడుమ ర్యాలీ ఆద్యంతం కోలాహలంగా సాగింది. అనంతరం నూనెపల్లె మారుతి నగర్ ప్రాంగణంలో నిర్వహించిన బహిరంగ సభలో మంత్రి ఎన్ఎండి ఫరూక్ మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలకు ఆకర్షితులై ఇతర పార్టీల నుంచి భారీగా చేరికలు జరుగుతున్నాయని తెలిపారు . ప్రజా సంక్షేమమే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తోందని, పార్టీ కోసం కష్టపడే ప్రతి కార్యకర్తకూ తగిన గుర్తింపు, న్యాయం జరుగుతాయని ఆయన స్పష్టం చేశారు.
టీడీపీలో చేరిన జాగటి బాల పక్కీరయ్య గౌడ్ (తిక్కన్న) మాట్లాడుతూ చంద్రబాబు నాయుడు నాయకత్వంలో మంత్రి ఫరూక్ సహకారంతో ప్రాంతీయ అభివృద్ధికి పూర్తి శక్తివంచన లేకుండా కృషి చేస్తామని తెలిపారు.
ఈ కార్యక్రమంలో టీడీపీ నంద్యాల జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్ఎండి ఫిరోజ్, మార్క్ఫెడ్ డైరెక్టర్ తాతిరెడ్డి తులసి రెడ్డి , నంద్యాల మార్కెట్ యార్డ్ చైర్మన్ గుంటుపల్లి హరిబాబు, మాజీ కౌన్సిలర్లు వాకా శివశంకర్ యాదవ్, శ్రీదేవి, మిద్దె ఉసేని, బాబుల్లా , మనీష్ రెడ్డి, చాబోలు ఇలియాజ్, గుద్దేటి వెంకటేశ్వర్లు, సాయిరాం రాయల్ , జెపి , బ్యాంకు తిమ్మయ్య , రమణయ్య గౌడ్, దస్తగిరి మరియు స్థానిక టీడీపీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున ప్రజలు పాల్గొన్నారు.

# గణనాథులను భద్రపరచుకునేందుకు ప్రత్యేక ప్రదేశాలు

- **నగరపాలక సంస్థ కమిషనర్ చల్లా ఓబులేసు**
- **నీటి కొరత దృష్ట్యా చిన్న విగ్రహాలతోనే వినాయక చవితి నిర్వహించుకోవాలి**
- **పెద్ద విగ్రహాలను నిమజ్జనం చేయకుండా వచ్చే ఏడాదికి భద్రపరచుకోవాలి**

పల్లె వెలుగు కర్నూలు రిపోర్టర్ : ఎల్‌నినో ప్రభావం, వర్షాభావ పరిస్థితుల కారణంగా నీటి లభ్యత తగ్గిపోయిన నేపథ్యంలో ఈ ఏడాది వినాయక చవితి వేడుకలను చిన్న విగ్రహాలతో నిర్వహించుకుని, నీటిని పొదుపు చేయాలని నగరపాలక సంస్థ కమిషనర్ చల్లా ఓబులేసు విజ్ఞప్తి చేశారు. భక్తులు పెద్ద విగ్రహాలను భద్రపరచుకునేందుకు ఆదివారం సుంకేసుల రోడ్డులో రైల్వే ట్రాక్ పక్కన, ఎంఆర్‌సి ఫంక్షన్ హాల్ పక్కన, వెంకటరమణ కాలనీలో టూరిస్ట్ హోటల్ వెనుక ఉన్న ఖాళీ మైదానాలు, ఏ.క్యాంపు, జొహరాపురం ప్రాంతాల్లోని పలు మైదానాలను ఆయన పరిశీలించారు.ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. సుంకేసుల జలాశయంలో నీటి నిల్వలు పూర్తిస్థాయిలో తగ్గిపోయిన నేపథ్యంలో ప్రస్తుతం నగర ప్రజల తాగునీటి అవసరాలకు మాత్రమే సరిపడా నీటిని వినియోగించాల్సిన





పరిస్థితి ఏర్పడిందన్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో నిమజ్జన కార్యక్రమాలకు పెద్ద మొత్తంలో నీటిని వినియోగించడం సాధ్యం కాదన్నారు.అందువల్ల గణేష్ ఉత్సవ కమిటీ నిర్వాహకులు, భక్తులు గరిష్టంగా 1 నుంచి 1.5 అడుగుల పరిమాణంలో ఉండే చిన్న వినాయక విగ్రహాలను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. చిన్న విగ్రహాలను బకెట్లు, టబ్బుల్లో నిమజ్జనం చేసుకునేలా ఎంపిక చేసుకోవాలని కోరారు. పెద్ద విగ్రహాలకు కొత్తగా ఆర్డర్లు ఇవ్వవద్దని, ఇప్పటికే ఆర్డర్లు ఇచ్చిన వారు వాటిని రద్దు చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు.ఇప్పటికే పెద్ద విగ్రహాలు తయారై వచ్చిన వారు వాటిని నిమజ్జనం చేయకుండా భద్రపరిచి వచ్చే ఏడాది వినాయక చవితి వేడుకల్లో వినియోగించుకునేలా సహకరించాలని కమిషనర్ కోరారు. ఇందుకోసం నగరంలో ఐదు మైదానాలను గుర్తించి, పెద్ద విగ్రహాలను భద్రపరచుకునేందుకు తగిన ఏర్పాట్లు చేయనున్నట్లు తెలిపారు.మంత్రి టి.జి. భరత్, జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ. సిరి సూచనలు, నిర్ణయాలకు అనుగుణంగా తాగునీటి సంరక్షణకు అత్యధిక ప్రాధాన్యత ఇస్తున్నామని కమిషనర్ పేర్కొన్నారు. ప్రస్తుత నీటి పరిస్థితులను ప్రతి ఒక్కరూ అర్థం చేసుకుని, భక్తిని కొనసాగిస్తూనే నీటిని పొదుపు చేసే విధంగా వినాయక చవితి వేడుకలను నిర్వహించుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో ఎస్ఈ రమణమూర్తి, తదితరులు పాల్గొన్నారు.

# అదృశ్యమైన మహిళల ఆచూకీ తక్షణమే తేల్చాలి.

**ఏపీ మహిళా సమాఖ్య డిమాండ్ ?.**




పల్లె వెలుగు నంద్యాల రూరల్. గత 15 రోజులుగా అదృశ్యమై మిస్టరీగా మారిన నంద్యాలకు చెందిన నజియా, రాయపాడుకు చెందిన వివాహిత ఆదిలక్ష్మిల ఆచూకీని తక్షణమే తేల్చాలని నంద్యాల జిల్లా మహిళా సమాఖ్య జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు లక్ష్మీదేవి, రజిత డిమాండ్ చేశారు. ఆదివారం నంద్యాల పట్టణంలోని సీపీఐ జిల్లా కార్యాలయంలో వారు విలేకరుల సమావేశం నిర్వహించారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ

?గత నెల 18వ తేదీన అదృశ్యమైన ఈ ఇద్దరు మహిళలు ఎక్కడికి వెళ్లారు, ప్రస్తుతం వారు సురక్షితంగా ఉన్నారా లేదా అనే విషయాలపై 15 రోజులు గడుస్తున్నా స్పష్టత రాకపోవడం తీవ్ర ఆందోళన కలిగిస్తోందని మహిళా నేతలు పేర్కొన్నారు. బాధిత కుటుంబ సభ్యులు పోలీస్ స్టేషన్ల చుట్టూ తిరుగుతున్నా దర్యాప్తులో ఆశించిన పురోగతి కనిపించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. నజియా అదృశ్యం వెనుక ఆదిలక్ష్మి ప్రమేయం ఉందనే అనుమానాలతో గత రాత్రి రాయపాడులోని ఆదిలక్ష్మి ఇంట వద్ద నజియా బంధువులు ప్రశ్నించడం, ఈ క్రమంలో అక్కడ ఉద్రిక్త పరిస్థితులు నెలకొనడంపై వారు ఆందోళన వ్యక్తం చేశారు. ?ఇలాంటి ఘటనల వల్ల గ్రామీణ ప్రాంతాల్లో శాంతిభద్రతల సమస్యలు తలెత్తకుండా పోలీసులు వెంటనే రంగంలోకి దిగి సీసీ కెమెరా ఫుటేజీలు, సంభాషణల కాల్ డేటా, మొబైల్ టవర్ సిగ్నల్ల ఆధారంగా దర్యాప్తును వేగవంతం చేయాలని కోరారు. ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి, ఇద్దరు మహిళలు స్వచ్ఛందంగా వెళ్లిపోయారా లేక ఈ అదృశ్యం వెనుక మరేదైనా కుట్ర ఉందా అనే కోణంలో పారదర్శకంగా విచారణ జరిపి నిజాలను నిగ్గు తేల్చాలని, బాధిత కుటుంబాలకు త్వరితగతిన న్యాయం చేయాలని వారు డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో స్వరూప, సుశీలమ్మ, పెద్ద ఎత్తున మహిళలు పాల్గొన్నారు.

# ఓటర్ల నమోదుపై ప్రత్యేక దృష్టి

**- కర్నూలు ఈఆర్వో, కమిషనర్ చల్లా ఓబులేసు**

పల్లె వెలుగు కర్నూలు రిపోర్టర్ : కర్నూలు అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలో కొత్త ఓటర్ల నమోదుపై ప్రత్యేక దృష్టి సారించాలని కర్నూలు అసెంబ్లీ ఓటరు నమోదు అధికారి, నగరపాలక కమిషనర్ చల్లా ఓబులేసు బిఎల్వోలను ఆదేశించారు. ఆదివారం కర్నూలు అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలోని పలు పోలింగ్ కేంద్రాల్లో 'స్పెషల్ క్యాంపెయిన్ డే' కార్యక్రమాలను ఆయన పరిశీలించారు.



ఈ సందర్భంగా ఈఆర్వో మాట్లాడుతూ.. ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణలో భాగంగా అర్హులైన కొత్త ఓటర్ల నమోదు, ఓటర్ల వివరాల్లో మార్పులు, సవరణలు, అనర్హుల పేర్ల తొలగింపు, అభ్యంతరాల స్వీకరణ ప్రక్రియ కొనసాగుతోందన్నారు. క్లెయిమ్‌లు, అభ్యంతరాల స్వీకరణ గడువును ఈ నెల 10వ తేదీ వరకు మాత్రమే ఉన్నట్లు తెలిపారు. 18 ఏళ్లు నిండిన అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకోవాలని సూచించారు. కొత్తగా ఓటరుగా నమోదు చేసుకునేందుకు ఫారం-6, ఓటరు జాబితాలో అనర్హుల పేర్ల తొలగింపు లేదా అభ్యంతరాల కోసం ఫారం-7, ఓటరు జాబితాలో పేరు, చిరునామా తదితర వివరాల్లో మార్పులు, సవరణలు లేదా నివాస మార్పు కోసం ఫారం-8ను వినియోగించుకోవచ్చని తెలిపారు. అర్హులైన ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును నిర్ధారించుకునేలా ఓటరు జాబితాను పరిశీలించుకోవాలని, అవసరమైన క్లెయిమ్‌లు, అభ్యంతరాలను నిర్ణీత గడువులోగా సమర్పించాలని ఈఆర్వో చల్లా ఓబులేసు కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్ఈ రమణమూర్తి పాల్గొన్నారు.

# ఉప్పొంగిన ప్రజా చైతన్యం:

# అఖిలపక్ష పోస్టుకార్డు ఉద్యమానికి విశేష స్పందన.

**ఆర్ ఏ ఆర్ ఎస్ నుంచి కలెక్టరేట్ తరలించాలి, నూనెపల్లె మార్కెట్ యార్డు భూకేటాయింపును రద్దు చేయాలి.**





పల్లె వెలుగు నంద్యాల రూరల్. నంద్యాల ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం (ఆర్ ఏ ఆర్ ఎస్)లో ఏర్పాటు చేసిన తాత్కాలిక కలెక్టరేట్ కార్యాలయాన్ని వెంటనే తరలించాలని, నూనెపల్లె మార్కెట్ యార్డులో తెలుగుదేశం పార్టీ కార్యాలయం కోసం కేటాయించిన రెండు ఎకరాల స్థలాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ అఖిలపక్ష ఐక్యవేదిక ఆధ్వర్యంలో చేపట్టిన పోస్టుకార్డు ఉద్యమానికి ప్రజల నుంచి విశేష స్పందన లభించింది.

?ఆత్మకూరు బస్టాండ్ నుంచి నంద్యాల మెయిన్ పోస్ట్ ఆఫీస్ వరకు నిర్వహించిన పోస్టుకార్డు ర్యాలీలో పెద్ద సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు. రెండు ప్రజా సమస్యలపై అవగాహన కల్పించిన అనంతరం, ప్రజలు స్వయంగా పోస్టుకార్డులపై తమ అభిప్రాయాలు, డిమాండ్లు రాసి ప్రభుత్వానికి పంపేందుకు మెయిన్ పోస్ట్ ఆఫీస్‌లో పోస్టు చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, దాదాపు 125 ఏళ్ల చరిత్ర కలిగిన ఆర్ ఏ ఆర్ ఎస్ లో తాత్కాలిక కలెక్టరేట్ ఏర్పాటు చేయడం వల్ల వ్యవసాయ పరిశోధనలకు తీవ్ర అంతరాయం కలుగుతోందని, వెంటనే ఆ కార్యాలయాన్ని తరలించాలని డిమాండ్ చేశారు. అలాగే ప్రజా అవసరాల కోసం ఉద్దేశించిన నూనెపల్లె మార్కెట్ యార్డులో రాజకీయ పార్టీ కార్యాలయం కోసం రెండు ఎకరాల స్థలం కేటాయించడం ప్రజా ప్రయోజనాలకు విరుద్ధమని, ఆ కేటాయింపును ప్రభుత్వం వెంటనే రద్దు చేయాలని కోరారు.

?అఖిలపక్ష ఐక్యవేదిక అధ్యక్షులు ఏర్వ రామచంద్రారెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో కో-కన్వీనర్లు ఎజాస్, జానయ్య, మహేశ్వర్ రెడ్డి, యుగంధర్ రెడ్డి, చిత్తలూరు శేషపాణి, అడ్వకేట్ శంకరయ్య, యన్. సుబ్బరామయ్య, విద్యార్థి నాయకుడు రాంబాబు, ప్రొఫెసర్ శివరామిరెడ్డి, చౌడప్ప, చింతలయ్య, అడ్వకేట్ నాగేశ్వరరెడ్డి, బొజ్జా దశరథ రామిరెడ్డి, పట్నం రాముడు, నిట్టూరు సుధాకర్ రావు తదితరులు పాల్గొన్నారు.

?ప్రజా ఒత్తిడి పెంచడమే లక్ష్యం

?ప్రజల అభిప్రాయాన్ని నేరుగా ప్రభుత్వానికి తెలియజేసి, ఈ రెండు సమస్యల పరిష్కారానికి ప్రజా ఒత్తిడి పెంచడమే పోస్టుకార్డు ఉద్యమం లక్ష్యమని నాయకులు తెలిపారు. ఈ ఉద్యమంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని వారు పిలుపునిచ్చారు.

## నేడు కర్నూలు నగరపాలక సంస్థలో

# 'ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక'

**- కర్నూలు నగరపాలక సంస్థ కమిషనర్ చల్లా ఓబులేసు**

పల్లె వెలుగు కర్నూలు రిపోర్టర్ : కర్నూలు నగరపాలక సంస్థలో సోమవారం 'ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక' కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు కమిషనర్ చల్లా ఓబులేసు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10:00 గంటలకు స్థానిక ఎస్బిఐ ఎంప్లాయీస్ కాలనీలోని నగరపాలక సమావేశ భవనంలో నిర్వహించనున్నట్లు కమిషనర్ తెలిపారు. ఈ కార్యక్రమానికి నగరపాలకకు చెందిన అన్ని విభాగాల అధికారులు హాజరు అవుతారని, కాలనీల్లోని మౌలిక వసతులు, రహదారులు, డ్రైనేజీ, వీధి వెలుగులు, పరిశుభ్రత వంటి సమస్యలను ప్రజలు లిఖిత పూర్వకంగా సమర్పించవచ్చని తెలిపారు. ప్రతి ఫిర్యాదు స్వీకరించబడిన వెంటనే సంబంధిత అధికారులకు పంపి, పరిష్కారం కోసం నిర్దిష్ట గడువులు నిర్ణయించబడతాయని ఆయన వెల్లడించారు. అదేవిధంగా, ప్రతి ఫిర్యాదు పురోగతిని పౌరులు స్వయంగా ష్ట్రజూం://వీవవనిశీయిఎ.ఖజూ.స్త్రశీఇ.అఅ వెబ్‌సైట్ ద్వారా తెలుసుకోవచ్చని కమిషనర్ వివరించారు.



# దాహార్తితో అలమటించిన ముగతికి

- **బుట్టా రేణుక బుట్టా శివ నీలకంఠ అండ**
- **తక్షణ స్పందనతో తాగునీటి ట్యాంకర్లు.**
- **గ్రామ ప్రజలకు తాత్కాలిక ఉపశమనం,,**

నందవరం, పల్లె వెలుగు సెప్టెంబర్ 6 నందవరం మండలం ముగతి గ్రామంలో తీవ్ర తాగునీటి ఎద్దడి నెలకొనడంతో గ్రామ ప్రజలు పడుతున్న ఇబ్బందులను గ్రామ మాజీ సర్పంచ్, వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ బీసీ సెల్ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి విరూపాక్షి రెడ్డి కర్నూలు పార్లమెంట్ సమన్వయకర్త, మాజీ ఎంపీ శ్రీమతి బుట్టా రేణుక దృష్టికి తీసుకెళ్లారు. బి సమస్యను తెలుసుకున్న బుట్టా రేణుక గారు వెంటనే స్పందించి, తన భర్త, బుట్టా ఫౌండేషన్ అధినేత శ్రీ బుట్టా శివ నీలకంఠ



కి తెలియజేయడంతో ఆయన తక్షణమే స్పందించి బుట్టా ఫౌండేషన్ ద్వారా ముగతి గ్రామానికి తాగునీటి ట్యాంకర్లను ఏర్పాటు చేయించారు.




దీంతో దాహార్తితో అలమటిస్తున్న గ్రామ ప్రజలకు తాత్కాలిక ఉపశమనం లభించింది. సమస్యను వెంటనే పరిష్కరించేందుకు స్పందించిన బుట్టా రేణుక, బుట్టా శివ నీలకంఠ కి గ్రామ ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు.

# బగ్గుమంటున్న భానుడు,బుగ్గి అయినపంట పొలాలు

- ఎండతాపానికిఅల్లాడుతున్నప్రజలు
- నిర్మానుష్యంగా దొర్నిపాడులోని ప్రధాన రహదారి

దొర్నిపాడు సెప్టెంబర్ 6 పల్లె వెలుగు న్యూస్ ఎండలువేసవినితలపిస్తు బగ్గు





మంటున్నభానుడిప్రతాపానికి రైతులు సాగు చేసిన పంట పొలాలుబుగ్గి అవుతున్నాయి, ప్రజలు బయటకు రావాలంటే ఎండ తపానికి అల్లాడుతూ జంకుతున్నారు. ఉదయం పదిగంటలు దాటగానే భానుడి ప్రతాపానికి దొర్నిపాడు లోని ప్రధాన రహదారులు నిర్మానుషంగా మారుతున్నాయి దీంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఎక్కడ చూసినా పచ్చదనంతో ఉండాల్సిన పొలాలుఎడారిలమారుతున్నాయి. అలాగేగత వారం రోజులుగా వాతావరణం లోపూర్తిగా మార్పులు రావడంతో ఇళ్లలో ఉండలేక ఉక్కపోతకు తట్టుకోలేక పోతున్నారు. మధ్యాహ్న సమయంలో చెట్లకింద సేదతీరుతున్నారు. ఇలాంటి విపత్కర పరిస్థితుల ఎంతకాలం ఉంటాయోయని ప్రజలుఆందోళనచెందుతున్నారు.

# పబ్లిక్ టాయిలెట్స్ వర్కర్స్ కు కనీస వేతనం ఇవ్వాలి-ఏఐటీయూసీ.

- **పబ్లిక్ టాయిలెట్స్ వర్కర్స్ సమస్యలు పరిస్కారం చేయాలి.**
- **ఏ ఐ టి యు సి జిల్లా సమితి సభ్యులు మురళీధర్, ఏఐటియుసి నంద్యాల సిటీ అధ్యక్ష,కార్యదర్శులు డి. శ్రీనివాసులు, ధనుంజయ్.**

పల్లె వెలుగు నంద్యాల రూరల్. పబ్లిక్ టాయిలెట్ వర్కర్స్ కు కొత్తగా వచ్చినటువంటి కాంట్రాక్టర్ నంద్యాల పట్టణంలో పనిచేస్తున్నటువంటి పబ్లిక్ టాయిలెట్ వర్కర్స్ కు మస్టర్ వేయడం లేదు. మస్టర్ వేయాలని, పబ్లిక్ టాయిలెట్ వర్కర్స్ కు పి ఎఫ్, ఈ ఎస్ ఐ సౌకర్యం కల్పించాలని,పబ్లిక్ టాయిలెట్ వర్కర్స్ కు కనీస వేతనం ఇవ్వాలని,60 సంవత్సరాలు పూర్తయినటువంటి వర్కర్స్ ను తొలగించకుండా పని చేయించుకోవాలని,పబ్లిక్ టాయిలెట్ వర్కర్స్ కు ప్రతినెలా కూడా జీతం క్లినింగ్ సామాగ్రి అయినటువంటి సబ్బులు,



అకౌంట్లో జమ చేయాలని,నంద్యాల పట్టణంలో రిపేర్ లో ఉన్నటువంటి పబ్లిక్ టాయిలెట్స్ ను రిపేర్ చేసేంతవరకు అక్కడ పని చేస్తున్నటువంటి వర్కర్స్ కు పని కల్పించాలని, రిపేర్ లో ఉన్నటువంటి టాయిలెట్స్ ను వెంటనే రిపేర్ చేయించాలని, పబ్లిక్ టాయిలెట్స్ వర్కర్స్ కు పినయిల్, బ్రెష్ లు ఇవ్వాలని ఏఐటీయూసీ జిల్లా సమితి సభ్యులు మురళీధర్, ఏఐటీయూసీ నంద్యాల పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు డి. శ్రీనివాసులు, ధనుంజయ్ మున్సిపల్ అధికారులను, పబ్లిక్ టాయిలెట్స్ కాంట్రాక్టర్లను డిమాండ్ చేశారు.

## లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయ దినోత్సవం

### లయన్స్ క్లబ్ ఉపాధ్యాయ దినోత్సవ పురస్కారాల ప్రధానం




నంద్యాల ప్రతినిధి. సెప్టెంబర్ 06 . (పల్లె వెలుగు ):డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతి పురస్కరించుకొని ఉపాధ్యాయ దినోత్సవం నంద్యాల లైన్స్ క్లబ్ ఆధ్వర్యంలో సీనియర్ లయన్స్ సభ్యులు శ్రీకాంత్ సహకారంతో కళరాధన ఆఫీసులో ఘనంగా నిర్వహించడం జరిగింది. లయన్స్ క్లబ్ అధ్యక్షుడు సందీప్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో కార్యదర్శి చంద్రశేఖర్, కోశాధికారి సురేష్,రీజియన్ చైర్మన్ నిజాముద్దీన్,జోనల్ చైర్మన్ నాగరాజు, లయన్ చాటర్ మెంబర్ ఆంజనేయులు గుప్తా, సీనియర్ సభ్యులు గోల్ల సుదర్శనం,ఎంపీ వి రమణయ్య అతిథులుగా పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఉపాధ్యాయులు జి పద్మావతి, కేశమ్మ, ఎం.ఆర్.టి ప్రసాద్, రంగనాథ్ లకు ఉపాధ్యాయ దినోత్సవ పురస్కారాలు అందజేసి ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో సుంకయ్య, రామయ్య,వాసుకుట్టి మరియు సభ్యులు పాల్గొన్నారు.

## జూనియర్ కళాశాల విద్యార్థి ఆత్మహత్య




బండి ఆత్మకూరు పల్లె వెలుగు సెప్టెంబర్ 6 : బండి ఆత్మకూరు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరం చదువుతున్న లోకేష్(19) అనే విద్యార్థి ఆత్మహత్య చేసుకున్నాడని ఎస్ఐ జగన్మోహన్ పేర్కొన్నారు. ఆదివారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో చీరతో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. అవుకు మండలం సింగంపల్లి గ్రామానికి చెందిన లోకేష్ గత సంవత్సరం విజయవాడలోని అమృత సాయి కళాశాలలో ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరంలో చేరాడు. అయితే అక్కడ చదువు ఇష్టం లేదని తెలియడంతో, బండి ఆత్మకూరులో లోకేష్ పెద్దమ్మ ఇంటికి చేరాడు. ఈ ఏడాది బండి ఆత్మకూరులోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రథమ సంవత్సరం బైపిసి లో చేరాడు. హఠాత్తుగా లోకేష్ ఉరివేసుకొని మృతి చెందడంతో తోటి విద్యార్థులు ఆందోళన చెందుతున్నారు. లోకేష్ కు చదువు పైన ఇష్టం లేదని తండ్రి ప్రసాద్ ఫిర్యాదు చేశారని ఎస్ఐ పేర్కొన్నారు. శవాన్ని పోస్టుమార్టం నిమిత్తం నంద్యాల ప్రభుత్వాసుపత్రికి తరలించి కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ పేర్కొన్నారు.

## నూతనంగా మొబైల్ షాప్ మెడికల్ షాప్

### ప్రారంభించిన యువ నేత వై.ప్రదీప్ రెడ్డి

ఎమ్మిగనూరు పల్లె వెలుగు సెప్టెంబర్ 5 కర్నూలు జిల్లా ఎమ్మిగనూరు పట్టణంలో




మంత్రాలయం నియోజవర్గం పరిధిలోని పెద్దకడబూరు మండల పరిధిలోని కంబాలదిన్నె గ్రామానికి చెందిన వడ్డే వీరేష్ తన కుమారులకు ఒక్కరికి మెడికల్ షాప్ మరొక్కరికి సెల్ఫోన్ పాయింట్ ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా వైఎస్ఆర్ సీపీ కర్నూలు జిల్లా ఉపాధ్యక్షులు వై.ప్రదీప్ రెడ్డి నూతనంగా సెల్ఫోన్ పాయింట్ మరియు మెడికల్ షాప్ ఘనంగా ప్రారంభించారు ప్రారంభం అనంతరం జిల్లా ఉపాధ్యక్షులు వారికి గజమాలతో ఘన సన్మానం చేశారు

### సిద్ధ అజ్జా దేవాలయ నిర్మాణానికి

## రూ.1,05,111 విరాళం

హోలగుంద గ్రామంలోని సులువాయి రోడ్డులో నూతనంగా నిర్మించనున్న శ్రీ శ్రీ సిద్ధ అజ్జా దేవాలయ నిర్మాణ పనులు కొనసాగుతున్నాయి. ఈ సందర్భంగా హుబ్బ?? జిల్లా ఉంనకల్ గ్రామానికి చెందిన భక్తులు, శ్రీ శ్రీ సద్గురు సిద్ధపజ్జ సేవా సమితి సభ్యులు దేవాలయ నిర్మాణానికి తమ వంతు సహాయంగా ముందుకు వచ్చారు.



దేవాలయ నిర్మాణ నిమిత్తం రూ.1,05,111 నగదును గుడి కమిటీ సభ్యుడు నవ్వులే నగేష్ మరియు వారి కుటుంబ సభ్యులకు అందజేశారు. భక్తుల సహకారంతో దేవాలయ నిర్మాణ పనులను వేగవంతంగా పూర్తి చేసేందుకు కృషి చేస్తున్నట్లు గుడి కమిటీ సభ్యులు తెలిపారు.

ఈ సందర్భంగా విరాళం అందించిన శ్రీ శ్రీ సద్గురు సిద్ధపజ్జ సేవా సమితి సభ్యులకు, ఉంనకల్ గ్రామ భక్తాదులకు గుడి కమిటీ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. భక్తుల సహకారంతో శ్రీ సిద్ధ అజ్జా దేవాలయం నిర్మాణం ఘనంగా పూర్తి కావాలని ఆకాంక్షించారు.

## వేదవతి ప్రాజెక్టుకు జీవో 497తో నిధులు కేటాయిస్తే

- ఆర్డీఎస్ కుడికాలువకు ఎందుకు మొండిచేయి,,,,,
- యువగళం పాదయాత్రలో ఇచ్చిన హామీని లోకేష్ నిలబెట్టుకోవాలి,,,,,,
- పశ్చిమ ప్రాంత రైతాంగాన్ని నయవంచన చేసిన కూటమి ప్రభుత్వం,,,,,
- జి.రంగన్న సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు,,,,,,

ఎమ్మిగనూరు పల్లె వెలుగు సెప్టెంబర్ 6 కర్నూలు జిల్లాలో వేదవతి ప్రాజెక్టు నిర్మాణానికి జీవో నెంబర్ 497 విడుదల చేసి, నిధులు కేటాయించడాన్ని స్వాగతిస్తున్నామని, అదే సమయంలో దశాబ్దాలుగా పెండింగ్ లో ఉన్న పశ్చిమ ప్రాంత రైతాంగం ఎదురుచూస్తున్న ఆర్డీఎస్ కుడికాలువ నిర్మాణంపై కూటమి ప్రభుత్వం ఎందుకు నోరు మెదపడం లేదని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు జి. రంగన్న, భాస్కర్ యాదవ్ కూటమి ప్రభుత్వాన్ని ప్రశ్నించారు.

ఆదివారం సిపిఐ నియోజకవర్గ ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించడం జరిగింది.

ఈ సందర్భంగా సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు జి రంగన్న, భాస్కర్ యాదవ్ మాట్లాడుతూ ఒక ప్రాంతానికి జీవో ఇచ్చి నిధులు కేటాయిస్తూ, మరో ప్రాంతం రైతాంగానికి ఇచ్చిన హామీలను గాలికి వదిలేయడం "ఒకరికి పెళ్లి,మరొకరికి పేరంటం" అన్న చందంగా ఉందన్నారు.

యువగళం పాదయాత్ర సందర్భంగా లోకేష్ స్వయంగా 4 టీఎంసీల గల ఆర్డీఎస్ కుడికాలువ నిర్మాణాన్ని పూర్తిచేసే మంత్రాలయం, ఎమ్మిగనూరు నియోజకవర్గల రైతులకు సాగునీరు అందిస్తామని




హామీ ఇచ్చారని, అధికారంలోకి వచ్చిన తర్వాత మాత్రం ఆ హామీని మరిచిపోయారని విమర్శించారు. ఎన్నికల ముందు రైతుల పొలాల చుట్టూ తిరిగి హామీలు ఇచ్చి, అధికారం వచ్చిన తర్వాత అదే రైతుల కన్నీళ్లను పట్టించుకోకపోవడం "నోటి మాటలు కోటలు దాటినా చేతలు గడప దాటడం లేదు" అన్నట్లుగా ఉందన్నారు.

ఆర్డీఎస్ కుడికాలువ నిర్మాణం పూర్తయితే పశ్చిమ ప్రాంతంలోని 40 వేల ఎకరాలకు సాగునీరు, వందలాది గ్రామాలకు త్రాగునీరు, కోసిగి, కోటేకల్ చిన్న మరి వీడు ప్రాంతాలలో రిజర్వాయర్లు ఏర్పాటు చేస్తే ఈ ప్రాంతాలలో కరువు, వలసలు నివారించవచ్చు. అయితే ప్రభుత్వాల నిర్లక్ష్యం కారణంగా రైతాంగం ఏటా కరువుతో పోరాడాల్సి వస్తోందన్నారు. ఒకవైపు వర్షాలు లేక, మరోవైపు సాగునీరు లేక రైతులు అప్పుల ఊబిలో కూరుకుపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

పశ్చిమ ప్రాంత రైతాంగానికి సాగునీరు అందించాల్సిన ప్రభుత్వం హామీలను అమలు చేయకుండా కాలయాపన చేస్తే ప్రజలు చూస్తూ ఊరుకోరని హెచ్చరించారు. జీవోలు, ప్రకటనలు, హామీలు కాగితాలకే పరిమితం కాకుండా ఆర్డీఎస్ కుడికాలువ నిర్మాణానికి వెంటనే పరిపాలనా అనుమతులు, నిధులు మంజూరు చేసి పనులు ప్రారంభించాలని డిమాండ్ చేశారు.

వేదవతి ప్రాజెక్టుకు జీవో నెంబర్ 497 తో నిధులు కేటాయించినట్లే ఆర్డీఎస్ కుడికాలువ నిర్మాణానికి కూడా ప్రత్యేక జీవో విడుదల చేసి తగిన నిధులు కేటాయించాలని కోరారు. లేనిపక్షంలో పశ్చిమ ప్రాంత రైతాంగాన్ని సమీకరించి సిపిఐ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ప్రజా, రైతాంగ పోరాటం చేపడతామని వారు హెచ్చరించారు.


ఈ సమావేశంలో సిపిఐ జిల్లా సమితి సభ్యులు సోమేశ్వర్ రెడ్డి, మద్దిలేటి నాయుడు, ఎమ్మిగనూరు మండల కార్యదర్శి రాజీవ్, గోనెగండ్ల మండల కార్యదర్శి శ్రీ రాములు, నందవరం మండల కార్యదర్శి గిడ్డయ్య, మరియు సిపిఐ నాయకులు తిమ్మ గురుడు, వీరేష్, విజయేంద్ర, నరసింహులు, నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

## సకాలంలో వర్షాలు కురవాలని శ్రీ పోతలింగేశ్వర స్వామికి జలాభిషేకం

హోళగుంద పల్లె వెలుగు సెప్టెంబర్ : 06.రైతులకు సకాలంలో వర్షాలు కురిసి పంటలు సమృద్ధిగా పండాలని కోరుతూ గజ్జహళ్లి గ్రామస్తులు శ్రీ పోతలింగేశ్వర స్వామివారికి ప్రత్యేక జలాభిషేకం నిర్వహించారు.

గజ్జహళ్లి గ్రామం నుంచి శనివారం భక్తులు శిరుగుప్ప తాలూకా కెంచనగుడ్డ గ్రామ శివారులో ప్రవహిస్తున్న తుంగభద్ర నదికి వెళ్లారు. ఆదివారం ఉదయం అక్కడ వెలిసిన 101 శివలింగాలకు ప్రత్యేక పూజలు నిర్వహించి, పవిత్రమైన తుంగభద్ర నది జలాలను బిందెలలో తీసుకుని బయలుదేరారు.

పోతరాజు పూజారి రామలింగ ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలు నిర్వహించగా, పవిత్ర జల బిందెను పూజారి బసవ శిరస్సుపై ధరించి తీసుకువచ్చారు. భక్తులు కలశాలు, పల్లకి, డప్పు వాయిద్యాలతో గ్రామాల మీదుగా భక్తిశ్రద్ధలతో ఊరేగింపుగా ప్రయాణించారు. సాయంత్రానికి గజ్జహళ్లి గ్రామానికి చేరుకున్న అనంతరం శ్రీ






పోతలింగేశ్వర స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి తుంగభద్ర నది జలాలతో అభిషేకం చేశారు.

అనంతరం స్వామివారికి 101 బిందెల నీటితో జలాభిషేకం నిర్వహించి, రైతులకు సకాలంలో వర్షాలు కురవాలని, గ్రామ ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలని ప్రత్యేక ప్రార్థనలు చేశారు.

గ్రామంలో ఆనవాయితీగా వస్తున్న నాలుగో శనివారం, ఆదివారం ఈ ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నట్లు పూజారి శినప్ప తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## పేదల ఆరోగ్య రక్షణకు సీఎం సహాయనిధి ఒక వరం: ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి

### పాణ్యం నియోజకవర్గంలో రూ. 43.99 లక్షల సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ




పల్లె వెలుగు కర్నూలు బ్యూరో ఆపదలో ఉన్న పేదలకు ముఖ్యమంత్రి సహాయనిధి (సీఎంఆర్ఎఫ్) ఒక కొండంత అండ అని పాణ్యం ఎమ్మెల్యే, టీడీపీ నంద్యాల జిల్లా అధ్యక్షురాలు గౌరు చరితారెడ్డి పేర్కొన్నారు. నియోజకవర్గ పరిధిలోని పలు మండలాలకు చెందిన 55 మంది లబ్ధిదారులకు ప్రభుత్వం మంజూరు చేసిన రూ. 43,99,275/- విలువైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను ఆమె లబ్ధిదారులకు స్వయంగా అందజేశారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం రాష్ట్ర సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యతనిస్తోందని తెలిపారు. నిరుపేదలు కార్పొరేట్ ఆసుపత్రుల్లో చికిత్స పొంది ఆర్థికంగా ఇబ్బందులు పడకూడదనే ఉద్దేశంతోనే సీఎం సహాయనిధి ద్వారా వేగంగా ఆర్థిక సాయం అందిస్తున్నట్లు చెప్పారు. గతంలో



ఎన్నడూ లేని విధంగా అర్హులైన ప్రతి ఒక్కరికీ నిధులు మంజూరయ్యేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు.

అనంతరం లబ్ధిదారులు మాట్లాడుతూ, ఆపత్కాలంలో తమకు అండగా నిలిచి ఆర్థిక సాయం అందించినందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు , నిధులు మంజూరు చేయించడంలో కృషి చేసిన ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక కూటమి నాయకులు, కార్యకర్తలు, లబ్ధిదారుల కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

## భగత్ సింగ్ సుందరయ్య ఫౌండేషన్‌కు ఆర్థిక సహాయం

ఆదోని (పల్లె వెలుగు): అత్యవసర పరిస్థితుల్లో పేద, సామాన్య ప్రజలకు అండగా నిలిచేందుకు భగత్ సింగ్ సుందరయ్య ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేస్తున్న మరో అంబులెన్స్‌కు తెలుగుదేశం పార్టీ జిల్లా అధ్యక్షురాలు గుడిసె ఆది కృష్ణమ్మ రూ.10 వేల ఆర్థిక సహాయం అందించారు. పేద ప్రజలకు అత్యవసర వైద్య సేవలు అందించడంలో అంబులెన్స్ సేవలు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయని ఆమె తెలిపారు. ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొనే కుటుంబాలకు అంబులెన్స్ సేవలు అందుబాటులో ఉండేలా ఫౌండేషన్ చేస్తున్న కృషిని అభినందించారు. భగత్ సింగ్ సుందరయ్య ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఇప్పటికే ప్రజలకు అందిస్తున్న సేవలను మరింత విస్తరించేందుకు మరో అంబులెన్స్ ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమానికి తన వంతు సహాయంగా రూ.10 వేల ఆర్థిక సహాయం అందించినట్లు తెలిపారు. పేద, సామాన్య ప్రజలకు అత్యవసర సమయాల్లో వైద్య సహాయం అందించేందుకు చేపడుతున్న ఈ కార్యక్రమానికి దాతలు, ప్రజలు తమవంతు సహకారం అందించాలని ఆమె కోరారు. ఫౌండేషన్ సేవా కార్యక్రమాలకు అన్ని విధాలా సహకరిస్తామని తెలిపారు. ఈ సందర్భంగా ఫౌండేషన్ ప్రతినిధులు గుడిసె ఆది కృష్ణమ్మకు కృతజ్ఞతలు తెలిపారు.



# వినాయక ఉత్సవాలపై శాంతి కమిటీ సమావేశం

**మండపాల ఏర్పాటుకు ఆన్‌లైన్ పోలీస్ అనుమతి తప్పనిసరి -- ఎస్సై మహేష్‌కుమార్**





ఆదోని (పల్లె వెలుగు): కర్నూలు జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు, ఆదోని డీఎస్పీ ఆదేశాల మేరకు ఎస్వీ పోలీస్‌స్టేషన్ పరిధిలోని అన్ని గ్రామాల వినాయక ఉత్సవ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు, ఇతర మతాల పెద్దలతో ఎస్వీ పోలీస్‌స్టేషన్‌లో శాంతి కమిటీ సమావేశం నిర్వహించారు. ఎస్సై మహేష్‌కుమార్ ఆధ్వర్యంలో ఈ సమావేశం జరిగింది.
ఈ సందర్భంగా వినాయక చవితి ఉత్సవాలను ప్రశాంత వాతావరణంలో, సోదరభావంతో నిర్వహించేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పాటించాల్సిన నిబంధనలపై ఎస్సై మహేష్‌కుమార్ అవగాహన కల్పించారు. వినాయక మండపం ఏర్పాటు చేసినప్పటి నుంచి నిమజ్జనం పూర్తయ్యే వరకు నిర్వాహకులు బాధ్యతగా వ్యవహరించాలని సూచించారు. వినాయక మండపాలు ఏర్పాటు చేయదలచిన ప్రతి నిర్వాహకుడు తప్పనిసరిగా ఆన్‌లైన్‌లో నమోదు చేసుకుని పోలీసుల అనుమతి పొందాలని ఎస్సై తెలిపారు. ఇందుకోసం “వినాయక ఉత్సవాల ఆన్‌లైన్ దరఖాస్తు/స్థితి పేజీ” (ట్రైజూం://స్త్రుఅవంప్లఫ్యిజ.అవ్/ఘుజూజూశ్రీఅషేఫ్ అశీఅఫ్ఖబం?బ్ఎబింశీబతీఎవ=ఎష్ఘ్స్త్రజ్.ఎశీఎ) లో పైన తెలిపిన వెబ్సైట్లో నమోదు చేసుకోవాలని సూచించారు. మండపాల వద్ద భద్రతా చర్యలు పాటించాలని, ప్రజలకు, వాహనాల రాకపోకలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. విద్యుత్ ప్రమాదాలు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవడంతో పాటు, మండపాల వద్ద శాంతిభద్రతలకు విఘాతం కలిగించే చర్యలకు ఎవరూ పాల్పడవద్దని సూచించారు.
అలాగే నిమజ్జనం సమయంలో పోలీసుల సూచనలు, నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని, నిమజ్జన కార్యక్రమాన్ని ప్రశాంతంగా నిర్వహించేందుకు నిర్వాహకులు పోలీసులకు సహకరించాలని ఎస్సై మహేష్‌కుమార్ కోరారు.
అన్ని వర్గాల ప్రజలు పరస్పర సహకారంతో వినాయక చవితి ఉత్సవాలను సోదరభావంతో నిర్వహించుకోవాలని, ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా పోలీసులకు సహకరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. సమావేశంలో వినాయక ఉత్సవ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు, వివిధ మతాల పెద్దలు పాల్గొన్నారు.

# ఐరనగల్లులో భక్త కనకదాసు విగ్రహ ప్రతిష్ఠాపన

**కురుబ కులస్తులు చైతన్యంతో ముందుకు సాగాలి -- రాష్ట్ర కురుబ కురుమ కార్పొరేషన్ చైర్మన్ మాన్వి దేవేంద్రప్ప**

ఆదోని (పల్లె వెలుగు): కర్నూలు జిల్లా కోసిగి





మండలం ఐరనగల్లు గ్రామంలో కురుబల ఆరాధ్య దైవం భక్త కనకదాసు విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర కురుబ కురుమ వెల్ఫేర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ మాన్వి దేవేంద్రప్ప ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా దేవేంద్రప్ప మాట్లాడుతూ కురుబ కురుమ కులస్తులు అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించి సమాజంలో ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. కురుబలు నీతి, నియమాలు, సానుభూతికి మారుపేరుగా నిలుస్తారని అన్నారు. దేశంలో ఎక్కడ ఏ కార్యక్రమం జరిగినా కురుబలు ముందుండి తమ సేవలను అందిస్తున్నారని పేర్కొన్నారు. కురుబ కులస్తులు ఆర్థికంగా, విద్యాపరంగా, రాజకీయంగా ఎదగాల్సిన అవసరం ఉందని ఆయన సూచించారు. ముఖ్యంగా యువత విద్యకు అధిక ప్రాధాన్యతనిచ్చి ఉన్నత ఉద్యోగాలు సాధించి సమాజ సేవలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఆంధ్రప్రదేశ్‌లో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన అనంతరం నామినేటెడ్ పదవుల భర్తీలో భాగంగా వివిధ కులాలకు చెందిన నాయకులకు కార్పొరేషన్ చైర్మన్, డైరెక్టర్ పదవులు కేటాయించిందని తెలిపారు. అందులో భాగంగా తనకు రాష్ట్ర కురుబ కురుమ వెల్ఫేర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్‌గా బాధ్యతలు అప్పగించారని పేర్కొన్నారు. అప్పటి నుంచి రాష్ట్రవ్యాప్తంగా కురుబ కురుమ కులస్తులను గుర్తించి, వారి సమస్యలను తెలుసుకుని చైతన్యపరిచేందుకు తన వంతు కృషి చేస్తున్నానని తెలిపారు. ప్రస్తుతం స్థానిక సంస్థల ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో కురుబ కులస్తులు ఐక్యంగా ఉండాలని దేవేంద్రప్ప సూచించారు. బీసీలకు రిజర్వేషన్ల అంశంలో ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలను ప్రస్తావిస్తూ, కురుబ కులానికి న్యాయం చేసే విధానాలను, కార్యక్రమాలను పరిశీలించి తగిన నిర్ణయాలు తీసుకోవాలని ఆయన కోరారు.
కురుబ కులస్తుల అభివృద్ధి కోసం ఎల్లప్పుడూ తన వంతు కృషి చేస్తానని దేవేంద్రప్ప హామీ ఇచ్చారు. గ్రామాల్లో కులస్తులంతా ఐక్యతతో ముందుకు సాగి, విద్య, ఉద్యోగాలు, వ్యాపారం, రాజకీయాలు తదితర రంగాల్లో రాణించాలని పిలుపునిచ్చారు.
భక్త కనకదాసు విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమానికి రాష్ట్ర కురుబ కురుమ కార్పొరేషన్ చైర్మన్ హాజరు కావడం పట్ల గ్రామంలోని కురుబ కులస్తులు, నిర్వాహకులు హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు, కురుబ కులస్తులు, యువత, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

# బీజేపీ నార్త్ మండల కార్యవర్గ సమావేశం

**స్థానిక సంస్థల ఎన్నికల్లో కాషాయ జెండా ఎగురవేయాలి.**

ఆదోని (పల్లె వెలుగు): ఆదోని ఎమ్మెల్యే డాక్టర్




పార్థసారథి వాల్మీకి ఆదేశాల మేరకు బీజేపీ నార్త్ మండల కార్యవర్గ సమావేశం నిజాముద్దీన్ కాలనీలో మండల అధ్యక్షుడు వాల్మీకి మహాదేవ్ అధ్యక్షతన నిర్వహించారు.
ఈ సందర్భంగా పార్టీ నాయకులు, కార్యకర్తలు రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని సమష్టిగా పనిచేయాలని పిలుపునిచ్చారు. కార్యకర్తలంతా సైనికుల్లా పనిచేసి పార్టీని క్షేత్రస్థాయిలో మరింత బలోపేతం చేసి, స్థానిక సంస్థల ఎన్నికల్లో కాషాయ జెండా ఎగురవేయాలని నాయకులు సూచించారు.
సమావేశంలో బూత్ స్థాయి కమిటీలను మరింత బలోపేతం చేయడం, ఫారం-7కు సంబంధించిన అంశాలపై చర్చించారు. ప్రతి బూత్‌లో పార్టీ కార్యకలాపాలను విస్తృతం చేసి, ప్రజలకు చేరువయ్యేలా కార్యాచరణ రూపొందించాలని నిర్ణయించారు. అలాగే బీఎల్ఏ-2 సభ్యుల భాగస్వామ్యాన్ని పెంచి ఓటరు జాబితా సంబంధిత అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు.
కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లడంతో పాటు స్థానికంగా ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం పోరాటాలు నిర్వహించాలని నాయకులు తెలిపారు. మహిళలు,



యువతను పెద్ద సంఖ్యలో పార్టీలోకి ఆహ్వానించి పార్టీని మరింత బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో ఓబీసీ మోర్చా జిల్లా ఉపాధ్యక్షుడు, మాజీ కౌన్సిలర్ ఏవీ సురేష్, వార్డు ఇన్‌చార్జి వాల్మీకి చంద్ర, మండల ప్రధాన కార్యదర్శి ఎర్రగుంట్ల రామకృష్ణ, నాయకులు పరమేష్, యువరాజు, శ్రీకాంత్‌తో పాటు సీనియర్ నాయకులు, బీఎల్ఏ-2 సభ్యులు, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

# వినాయక చవితి విగ్రహాలకు చందా అందజేసిన 38వ వార్డు టీడీపీ ఇంచార్జి తాటికొండ బుగ్గరాముడు.

పల్లె వెలుగు నంద్యాల జిల్లా బ్యూరో. నంద్యాల టౌన్ 38వ వార్డు వై.యస్.ఆర్ నగర్,నందమూరి నగర్, ఎస్సార్ బీసీ కాలనీ బుడగజంగం కాలనీ నందు వినాయక చవితి



పండగ సందర్భంగా ఏర్పాటు చేస్తున్న వినాయకుడి విగ్రహాలకు రాష్ట్ర న్యాయ మైనార్టీ శాఖ మంత్రి ఎన్ ఎం డి ఫరూక్ కుమారులు ఎన్ ఎండి ఫిరోజ్, ఎన్ ఎం డి ఫయాజ్ వారి నేతృత్వంలో దాదాపుగా 10 విగ్రహాలకు ఒక్కో విగ్రహానికి 5,000/-వేల చొప్పున 50,000/-వేల రూపాయలు విరాళాలు తెలుగుదేశం పార్టీ ఇంచార్జి తాటికొండ బుగ్గరాముడు అందజేశారు. ఈసందర్భంగా బుగ్గరాముడు మాట్లాడుతూ ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా భక్తి శ్రద్ధలతో ఆనందాలతో పండుగ చేసుకోవాలని ఆయన అన్నారు. ప్రతి ఒక్క విగ్రహానికి పోలీసు ద్వారా చట్టపరమైన పర్మిషన్ తీసుకుని నిర్వహించాలని కమిటీ సభ్యులకు ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో స్థానిక తెలుగుదేశం పార్టీ నాయకులు మరియు కార్యకర్తలు వినాయకుని విగ్రహాల కమిటీ సభ్యులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# ఆదోనిలో దారుణం

**పారిశుద్ధ్య కార్మికురాలిపై పెట్రోల్‌తో దాడి**

ఆదోని (పల్లె వెలుగు): పట్టణంలో తెల్లవారుజామున విధుల్లో ఉన్న మున్సిపల్ పారిశుద్ధ్య



కార్మికురాలిపై గుర్తుతెలియని మహిళలు పెట్రోల్‌తో దాడికి పాల్పడిన ఘటన తీవ్ర కలకలం రేపింది. విధులు నిర్వహిస్తున్న సమయంలో పారిశుద్ధ్య కార్మికురాలు నరసమ్మపై గుర్తుతెలియని మహిళలు పెట్రోల్ పోసి నిప్పంటించినట్లు సమాచారం. ఈ ఘటనతో ఒక్కసారిగా భయాందోళనకు గురైన నరసమ్మను స్థానికులు వెంటనే రక్షించి చికిత్స నిమిత్తం ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం నరసమ్మ ఆసుపత్రిలో చికిత్స పొందుతోంది. విధుల్లో ఉన్న కార్మికురాలిపై ఈ విధంగా దాడి జరగడం పట్ల స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఘటనకు గల కారణాలు ఏమిటి, దాడికి పాల్పడిన మహిళలు ఎవరు అనే విషయాలు తెలియాల్సి ఉంది. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనపై విచారణ చేపట్టారు. సంఘటనా స్థలాన్ని పరిశీలించి వివరాలు సేకరిస్తున్నారు. సమీప ప్రాంతాల్లోని సీసీ కెమెరాల ఫుటేజీలను పరిశీలిస్తూ నిందితులను గుర్తించే ప్రయత్నం చేస్తున్నట్లు సమాచారం. ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలు పోలీసుల దర్యాప్తులో వెల్లడికావాల్సి ఉంది.

# కోండారెడ్డి కుటుంబంలో ఘనంగా నిశ్చితార్థ వేడుక

**నూతన వధూవరులను ఆశీర్వదించిన మాజీ ఎమ్మెల్యే సాయి ప్రసాద్ రెడ్డి, ఎమ్మెల్సీ మధుసూదన్**



ఆదోని (పల్లె వెలుగు): కోండారెడ్డి కుటుంబంలో నిశ్చితార్థ వేడుకను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మాజీ ఎమ్మెల్యే సాయి ప్రసాద్ రెడ్డి, ఎమ్మెల్సీ మధుసూదన్ హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. ఈ సందర్భంగా నూతన వధూవరులకు శుభాకాంక్షలు తెలిపి, వారి భవిష్యత్ జీవితం సుఖసంతోషాలతో సాగాలని ఆకాంక్షించారు. కుటుంబ సభ్యులు, బంధువులు, స్నేహితులు పెద్ద సంఖ్యలో పాల్గొని నూతన జంటకు అభినందనలు, శుభాకాంక్షలు తెలిపారు. నిశ్చితార్థ వేడుక సందర్భంగా కుటుంబ సభ్యుల ఆనందోత్సాహాల మధ్య కార్యక్రమం సందడిగా సాగింది. పలువురు ప్రముఖులు, సన్నిహితులు హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు.

# మోటార్ సైకిల్ ను ఢీకొన్న కారు ఇద్దరికీ గాయాలు.

రుద్రవరం. పల్లె వెలుగు: మండలంలోని నరసాపురం పెట్రోలు బంకు సమీపంలో మోటార్ సైకిల్ ను కారు ఢీకొన్న సంఘటన లో ఇద్దరు వ్యక్తులు గాయపడ్డారు. పోలీసుల వివరాల మేరకు మందలూరు గ్రామానికి చెందిన గుర్రప్ప జంబులదిన్నె గ్రామానికి చెందిన దివాకర్ ఇద్దరు కలిసి మోటార్ సైకిల్ పై టి లింగందిన్నె గ్రామంలో తప్పెట వాయించి ఇంటికి తిరిగి వస్తూ నరసాపురం పెట్రోల్ బంకు దగ్గర మోటార్ సైకిల్ కు పెట్రోలు పట్టించుకోవడానికి వెళుతుండగా ఆళ్లగడ్డ వైపు నుంచి తెలంగాణ రాష్ట్రానికి చెందిన కారు వచ్చి మోటార్ సైకిల్ ను ఢీకొట్టడంతో మోటార్ సైకిల్ వెనుక కూర్చున్న గుర్రప్పకు తీవ్ర గాయాలు కాగా దివాకర్ కు గాయాలు అయ్యాయి అన్నారు. వీరి ఇరువురిని చికిత్స నిమిత్తం నంద్యాలలోని ఉదయానంద ఆసుపత్రికి తరలించారు అన్నారు. గుర్రప్ప భార్య లక్ష్మీదేవి ఇచ్చిన ఫిర్యాదు మేరకు హెడ్ కానిస్టేబుల్ రవికుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

# బిజినెస్

## 10 రోజుల్లో భారీగా తగ్గిన బంగారం, వెండి ధరలు




హైదరాబాద్
గత పది రోజుల వ్యవధిలో బంగారం, వెండి ధరలు గణనీయంగా తగ్గాయి. అంతర్జాతీయ మార్కెట్ల ప్రభావం, డిమాండ్‌లో మార్పులు వంటి కారణాలతో విలువైన లోహాల ధరలు దిగివచ్చాయి. గత నెల 28న 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.1,61,130 ఉండగా, ప్రస్తుతం రూ.1,54,800కు చేరింది. దీంతో పది రోజుల్లోనే రూ.6,330 మేర తగ్గుదల నమోదైంది. అదే విధంగా 22 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర కూడా రూ.5,800 తగ్గి ప్రస్తుతం రూ.1,41,900 వద్ద కొనసాగుతోంది. వెండి ధరల్లోనూ గణనీయమైన పతనం కనిపించింది. గతంలో కిలో వెండి ధర రూ.2,65,000 ఉండగా, ప్రస్తుతం రూ.2,55,000కు పడిపోయింది. దీంతో కిలో వెండిపై దాదాపు రూ.10,000 తగ్గుదల నమోదైంది. ధరలు తగ్గడంతో బంగారం, వెండి కొనుగోలు చేయాలనుకునే వినియోగదారులు, పెట్టుబడిదారులు ఆసక్తి చూపుతున్నట్లు మార్కెట్ వర్గాలు వెల్లడించాయి. ప్రస్తుతం ధరల ధోరణిపై వ్యాపారులు నిశితంగా పరిశీలిస్తున్నారు.

## ఫోక్స్‌వ్యాగన్ కార్లపై భారీ రాయితీలు..

**- రూ.6 లక్షల వరకు డిస్కౌంట్**





న్యూఢిల్లీ, సెప్టెంబర్ 5
పండుగల సీజన్‌ను దృష్టిలో ఉంచుకుని ప్రముఖ కార్ల తయారీ సంస్థ ఫోక్స్‌వ్యాగన్ తన వాహనాలపై భారీ రాయితీలను ప్రకటించింది. వినియోగదారులను ఆకర్షించేందుకు ఎంపిక చేసిన మోడళ్లపై రూ.6 లక్షల వరకు ఆర్థిక ప్రయోజనాలు అందిస్తున్నట్లు కంపెనీ వెల్లడించింది. ఈ ఆఫర్లలో టైగూన్, వర్చస్, టైగూన్ ఆర్-లైన్, టేరాన్ మోడళ్లు ఉన్నాయి. టైగూన్ ఎస్‌యూవీపై రూ.3.5 లక్షల వరకు నగదు రాయితీ ఇవ్వడంతో పాటు, ఎక్స్ఛేంజ్ బోనస్‌గా మరో రూ.2 లక్షలు, స్క్రాపేజ్ బోనస్‌గా రూ.20 వేల వరకు అందిస్తోంది. అదేవిధంగా, వర్చస్ సెడాన్‌పై లక్ష రూపాయలకు పైగా రాయితీ ప్రకటించిన సంస్థ, టేరాన్ మోడల్‌పైనా ఇదే స్థాయిలో ప్రయోజనాలు కల్పిస్తోంది. ఈ ప్రత్యేక ఆఫర్లు పరిమిత కాలానికి మాత్రమే వర్తిస్తాయని కంపెనీ తెలిపింది. ఆకర్షణీయమైన డిస్కౌంట్లతో ఫోక్స్‌వ్యాగన్ వాహనాల విక్రయాలు మరింత పెరిగే అవకాశముందని ఆటోమొబైల్ రంగ నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

## జావా సరికొత్త స్పోర్ట్స్ బైకు

**ప్రారంభ ధర రూ.2.08 లక్షలు**

బెంగళూరు,
ప్రముఖ స్పోర్ట్స్ బైకుల తయారీ సంస్థ జావా.. దేశీయ మార్కెట్‌కు మరో మాడల్‌ను తీసుకొచ్చింది. ఆల్ స్టార్స్ 42 బోబర్ పేరుతో విడుదల చేసిన ఈ స్పోర్ట్స్ బైకు ప్రారంభ ధర రూ.2,08, 942కాగా, గరిష్ఠ ధర రూ.2,19,942గా నిర్ణయించింది. ఈ ధరలు న్యూఢిల్లీ షోరూంనకు సంబంధించినవి. ఈ బైకును మహీంద్రా అధినేత ఆనంద్ మహీంద్రా ఆవిష్కరించారు. దేశీయంగా ఆల్ స్టార్స్ బైకులను పెరుగుతున్న డిమాండ్‌ను దృష్టిలో పెట్టుకొని ఈ నయా బైకును తీసుకొచ్చినట్టు కంపెనీ వర్గాలు వెల్లడించాయి. 334 సీసీ ఇంజన్, 29.9 పీఎస్‌ల శక్తి, సింగిల్ సిలిండర్, 4 స్ట్రోక్, లిక్విడ్ కూల్డ్, 12.5 లీటర్ల ఫ్యూయల్ ట్యాంక్ ఉన్నాయి



## వైభవ్ వీరకొట్టుడు..సిరాజ్ మళ్లీ బలయ్యాడుగా..!

భారత యువ సంచలనం వైభవ్ సూర్యవంశీ మరోసారి విధ్వంసక ఇన్నింగ్స్ ఆడాడు. ఇప్పటివరకూ వన్డే, టీ20ల్లో మెరుపు బ్యాటింగ్‌తో అలరించిన ఈ చిచ్చరపిడుగు.. ఈసారి ఎర్ర బంతిపైనా పగబట్టినట్టే ఆడాడు. వైభవ్ బౌండరీలతో విరుచుకుపడగా టీమిండియా సీనియర్ పేసర్ మహమ్మద్ సిరాజ్ బిత్తరపోయాడు. ఐపీఎల్ అరంగేట్రం సీజన్‌లో సిరాజ్ ఓవర్లో ఎడాపెడా దంచేసిన ఈ కుర్రాడు ఇప్పుడు దులీప్ ట్రోఫీ ఫైనల్లోనూ చుక్కలు చూపించాడు.'బౌలర్ ఎంతటివాడైనా నాకేంటీ.. నా స్టయిల్ ఇంతే' అన్నట్టుగా చెలరేగే వైభవ్ సూర్యవంశీ మరో ఖతర్నాక్ ఇన్నింగ్స్ ఆడాడు. దులీప్ ట్రోఫీలో ఈస్ట్ జోన్ ఓపెనర్‌గా ఆడుతున్న వైభవ్ ఫైనల్లో దంచేశాడు. సౌత్ జోన్ బౌలర్లను హడలెత్తించిన ఈ పదిహేనేళ్ల కుర్రాడు.. సిరాజ్ బౌలింగ్‌లోనూ చితక్కొట్టాడు. సీనియర్ పేసర్ అయిన అతడి ఓవర్లో వరసగా 4, 6.. చివరి బంతికి బౌండరీతో రెచ్చిపోయాడీ బ్యాటింగ్ సంచలనం. దాంతో, ఐపీఎల్ 18వ సీజన్‌లో గుజరాత్ టైటాన్స్ పేసర్‌గా ఆడిన సిరాజ్‌కు చుక్కలు చూపించిన వైభవ్.. ఇప్పుడు దులీప్ ట్రోఫీలోనూ పైచేయి సాధించాడు.




35 బంతుల్లోనే
రాజస్థాన్ రాయల్స్ ఓపెనర్‌గా పద్నాలుగేళ్లకే ఐపీఎల్‌లో అరంగేట్రం చేసిన వైభవ్.. గుజరాత్‌పై 35 బంతుల్లోనే మెరుపు శతకంతో చరిత్ర సృష్టించాడు. ఏకంగా 7 ఫోర్లు, 11 సిక్సర్లతో.. 265.79 స్ట్రయిక్ రేటుతో రికార్డు సెంచరీ సాధించాడు. ఇప్పుడు దులీప్ ట్రోఫీ ఫైనల్లో మియా భాయ్‌కి ఐపీఎల్ విధ్వంసాన్ని గుర్తు చేశాడు. సౌత్ బౌలర్లను భయపెడుతూ తొలి వికెట్‌కు ఓపెనర్ అభిమన్యు ఈశ్వరన్(72)తో కలిసి వంద రన్స్ జోడించిన వైభవ్.. 44 పరుగుల వద్ద ఔటయ్యాడు. అర్ధ శతకం చేజార్చుకున్నప్పటికీ రెడ్ బాల్ క్రికెట్‌లోనూ తాను మెరుపులు మెరిపించగలనని నిరూపించాడీ హిట్టర్.

## మహిళల టీ20 క్రికెట్‌లో హర్మన్ రికార్డు

**-150 మ్యాచ్‌లకు కెప్టెన్‌గా వ్యవహరించిన కౌర్**

**--ఈ ఫీట్ సాధించిన ఏకైక ప్లేయర్‌గా రికార్డు**

భారత మహిళల టీ20 క్రికెట్ చరిత్రలో ప్రస్తుత సారథి హర్మన్‌ప్రీత్ కౌర్ తన పేరును సువర్ణాక్షరాలతో లిఖించుకుంది. అంతర్జాతీయ టీ20లలో భారత్‌కు ఏకంగా 150 మ్యాచ్‌లలో నాయకత్వం వహించిన తొలి మహిళా కెప్టెన్‌గా ఆమె మైలురాయిని అందుకుంది. 2012లో తొలిసారి టీమిండియా పగ్గాలు చేపట్టిన హర్మన్, ఇప్పటివరకు సుదీర్ఘ కాలం పాటు కెప్టెన్‌గా వ్యవహరిస్తూ భారత జట్టుకు అనేక మరపురాని విజయాలను అందించింది. హర్మన్‌ప్రీత్ కౌర్ సారథ్యంలో టీమిండియా సత్తాచాటింది. కెప్టెన్‌గా ఆమె నేతృత్వం వహించిన 150 మ్యాచ్‌లలో భారత్ ఏకంగా 87 విజయాలను నమోదు చేసింది. మరో 57 మ్యాచ్‌లలో ఓటమి పాలైంది. ఒక మ్యాచ్ టై కాగా, 5 మ్యాచ్‌లు ఫలితం తేలకుండా ముగిశాయి. 58 శాతానికి పైగా గెలుపు రేటుతో హర్మన్ నేతృత్వంలో భారత జట్టు అత్యంత నిలకడైన ప్రదర్శనతో దూసుకుపోతోంది. భారత మహిళల జట్టుకు గతంలో సారథ్యం వహించిన మాజీ దిగ్గజాలు మిథాలీ రాజ్, జులన్ గోస్వామి వంటి ఆటగాళ్ల రికార్డులను హర్మన్ అధిగమించింది. మిథాలీ రాజ్ 2006-2016 మధ్యకాలంలో 32 మ్యాచ్‌లకు నాయకత్వం వహించి 17 విజయాలు సాధించగా, జులన్ గోస్వామి 18 మ్యాచ్‌లలో 8 విజయాలు నమోదు చేసింది. అంజుమ్ చోప్రా 10 మ్యాచ్‌లలో 3 విజయాలు సాధించింది. వీరితో పోలిస్తే హర్మన్‌ప్రీత్ ఏకంగా 150 మ్యాచ్‌లకు సారథ్యం వహించి రికార్డు నెలకొల్పింది.




భవిష్యత్ నాయకురాలిగా స్మృతి మంధాన
మరోవైపు వైస్ కెప్టెన్ స్మృతి మంధాన కూడా 2019 నుంచి 2026 మధ్యకాలంలో 18 టీ20 మ్యాచ్‌లకు కెప్టెన్‌గా వ్యవహరించింది. స్మృతి నేతృత్వంలో భారత్ 11 విజయాలు, 6 ఓటములు నమోదు చేసి 61.11% విజయాల శాతాన్ని సాధించింది. అయితే కెప్టెన్‌గా అత్యధిక మ్యాచ్‌లు ఆడటమే కాకుండా, మైదానంలో దూకుడుతో భారత జట్టుకు సరికొత్త గుర్తింపు తెచ్చింది హర్మన్‌ప్రీత్ కౌర్. అయితే వయసు ప్రభావం దృష్ట్యా.. ప్రస్తుత వైస్ కెప్టెన్ స్మృతి మంధానకు టీమిండియా పగ్గాలు అందించాలనే డిమాండ్లు వినిపిస్తున్నాయి.

# స్పోర్ట్స్

## పట్టువదలని విక్రమార్కులు..

**- తొలిసారి చైనా మాస్టర్స్ విజేతగా సాత్విక్ జోడీ..!**




భారత డబుల్స్ ద్వయం సాత్విక్ సాయిరాజ్ -- చిరాగ్ శెట్టి ఖాతాలో మరో టైటిల్ చేరింది. చైనా మాస్టర్స్ సెమీస్‌లో సంచలన విజయంతో ఫైనల్ చేరిన ఈ జోడీ.. ఆఖరి పోరులో చైనా జంటను చిత్తు చేసింది. ఆదివారం జరిగిన ఫైనల్లో హే జీ టింగ్ -- రెన్ గ్జియాంగ్‌పై అద్భుతం విజయంతో విజేతగా నిలిచింది సాత్విక్ -- చిరాగ్ జంట. తొలి సెట్ కోల్పోయినా ఆత్మవిశ్వాసం కోల్పోకని భారత జోడీ వరసగా రెండు సెట్లలో గెలుపొందింది. దాంతో.. చైనా షట్లర్లకు నిరాశే మిగిలింది.చైనా మాస్టర్స్‌లో సాత్విక్ సాయిరాజ్ -- చిరాగ్ శెట్టి ద్వయం ఛాంపియన్‌గా నిలిచింది. పురుషుల డబుల్స్‌లో అంచనాలు అందుకుంటూ ఫైనల్‌కు దూసుకెళ్లిన భారత జంట ధాటికి చైనా షట్లర్లు చేతులెత్తేశారు. తొలి సెట్‌ను 11-21తో కోల్పోయిన సాత్విక్ జోడీ ఒత్తిడికి లోనవ్వలేదు. రెండో సెట్‌లో గొప్పగా ఆడి హే జీ టింగ్ -- రెన్ గ్జియాంగ్‌కు 21-13తో షాకిచ్చింది. నిర్ణయాత్మక మూడో సెట్‌లోనూ భారత ద్వయం చెలరేగింది.ఫలితంగా 21-17తో సెట్‌ను గెలుపొందడంతో పాటు టైటిల్‌నూ సొంతం చేసుకుంది స్టార్ జోడీ. గతంలో రెండుసార్లు(2023, 2025) ఈ టోర్నీలో రన్నరప్‌గా నిలిచిన సాత్విక్ చిరాగ్ .. ఈసారి తమ కలను సాకారం చేసుకుంటూ విజేతగా నిలిచారు. మొత్తంగా ఈసీజన్‌లో వీరికి ఇది రెండో టైటిల్. ఈమధ్యే ఈ జంట సింగపూర్ ఓపెన్ సూపర్ 750 టైటిల్‌ను గెలిచింది

# కరాటేలో కాట్రావులపల్లి యువకుల గిన్నిస్ రికార్డు జగ్గంపేట

జగ్గంపేట, సెప్టెంబర్ 6(పల్లె వెలుగు): కాకినాడ జిల్లా



జగ్గంపేట మండలం కాట్రావులపల్లి గ్రామానికి చెందిన యువ కరాటే యోధులు అరుదైన ప్రతిభ కనబరిచి గిన్నిస్ ప్రపంచ రికార్డును కైవసం చేసుకున్నారు. గ్రామానికి చెందిన కె. లావరాజు, వై. శ్రీను ఈ ఘనత సాధించి ప్రాంతానికి గర్వకారణంగా నిలిచారు. కె. లావరాజు (బ్లాక్ బెల్ట్ 3వ డాన్): 2005లో ఒకినావా మార్షల్ ఆర్ట్స్ సంస్థ ద్వారా శిక్షణ ప్రారంభించిన లావరాజు, 2008లో మొదటి డాన్, 2017లో రెండో డాన్, 2026లో ప్రతిష్టాత్మక 3వ డాన్ సాధించారు. ప్రస్తుతం ఎందరో విద్యార్థులకు కరాటే నేర్పిస్తూనే, ప్రభుత్వ పాఠశాలల్లో బాలికలకు ఉచిత ఆత్మరక్షణ శిక్షణ ఇస్తున్నారు. వై. శ్రీను (బ్లాక్ బెల్ట్ 1వ డాన్): 2008లో కరాటే సాధన మొదలుపెట్టి, 2017లో మొదటి డాన్ బ్లాక్ బెల్ట్ సాధించారు. కార్పొరేట్ పాఠశాలలకే పరిమితం కాకుండా ప్రభుత్వ పాఠశాలల విద్యార్థినులకు ఆత్మరక్షణ మెలకువలు నేర్పుతూ సామాజిక బాధ్యత చాటుకుంటున్నారు. ఈ సందర్భంగా కాట్రావులపల్లి గ్రామ తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు ముసిరెడ్డి నాగేశ్వరరావు వారిని ఘనంగా సత్కరించి అభినందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, మారుమూల గ్రామం నుంచి వచ్చి గిన్నిస్ రికార్డు నెలకొల్పడం ప్రశంసనీయమన్నారు. ముఖ్యంగా ఆడపిల్లల రక్షణ కోసం వారు అందిస్తున్న నిస్వార్థ సేవలు ఆదర్శనీయమని, కూటమి ప్రభుత్వం ఇలాంటి ప్రతిభావంతు లను ఎల్లప్పుడూ ప్రోత్సహిస్తుందని పేర్కొన్నారు. భవిష్యత్తులో వీరు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో మరిన్ని విజయాలు సాధించాలని ఆయన ఆకాంక్షించారు.

# ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి: ప్రభుత్వ విప్ దాట్ల సుబ్బరాజు

కాట్రేనికోన, సెప్టెంబర్ 6(పల్లె వెలుగు): గ్రామీణ



ప్రాంతాల్లో నిర్వహించే ఉచిత వైద్య సేవలను పేద ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని ప్రభుత్వ విప్, ముమ్మిడివరం శాసనసభ్యులు దాట్ల సుబ్బరాజు పిలుపునిచ్చారు. ఆదివారం కాట్రేనికోనలోని పెద్ద ఆంజనేయ స్వామి ఆలయ సమీపంలో ప్రముఖ విలేఖరి పెనుమచ్చసత్యనారాయణ రాజు (రాజు) సౌజన్యంతో, శ్రీ సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరాన్ని ఎమ్మెల్యే దాట్ల సుబ్బరాజు ముఖ్య అతిథిగా విచ్చేసి ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేమాట్లాడుతూ, గ్రామీణ ప్రజలకు మెరుగైన వైద్యం చేరువ చేసేందుకు ఇలాంటి సేవా శిబిరాలు ఎంతగానో దోహదపడతా యన్నారు. ముఖ్యంగా తీవ్ర అసౌకర్యాన్ని కలిగించే 'వెరికోస్ వీన్స్' వంటి దీర్ఘకాలిక సమస్యలతో బాధపడుతున్న బాధితులు ఈ శిబిరాన్ని వినియోగించుకుని ఉచిత చికిత్స, వైద్య సలహాలు పొందాలని సూచించారు. గ్రామీణ ప్రజల ఆరోగ్య సంరక్షణ కోసం ముందు కొచ్చి శిబిరాన్ని విజయవంతంగా నిర్వహిస్తున్న శ్రీ సత్యసాయి సేవా సమితి ప్రతినిధులను, నిర్వాహకు లను ఆయన ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు చెల్లి సురేష్, మండల జనసేన పార్టీ అధ్యక్షుడు మోకా బాల ప్రసాద్, ముఖ్య నాయకులు శీలం సూర్యనారాయణ, కడలి వెంకట సత్యనారాయణ, గిడ్డి రత్నశ్రీతో పాటు కూటమి నాయకులు, కార్యకర్తలు, సేవా సమితి ప్రతినిధులు, స్థానిక ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# తాళ్లూరు లిఫ్ట్ పనులు వేగవంతం: 20 లోపు మొదటి పైప్‌లైన్ ప్రారంభం -- ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ

గండేపల్లి, సెప్టెంబర్ 6((పల్లె వెలుగు)::జగ్గంపేట



నియోజకవర్గ రైతుల చిరకాల సాగునీటి కలను సాకారం చేసే దిశగా కూటమి ప్రభుత్వం వేగంగా అడుగులు వేస్తోందని స్థానిక శాసనసభ్యులు జ్యోతుల నెహ్రూ పేర్కొన్నారు. గండేపల్లి మండలం తాళ్లూరు పరిధిలోని పుష్కర ఎత్తిపోతల (లిఫ్ట్ ఇరిగేషన్) పథకం పనుల ప్రగతిని ఆయన ఆదివారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. పోలవరం ఈఈ రాజేశ్వరరావు, ఎలక్ట్రికల్ ఈఈ వీరభద్రరావు, నిర్మాణ సంస్థ ప్రతినిధులతో కలిసి తాళ్లూరు లిఫ్ట్ ప్రధాన కేంద్రం నుండి సీతారాంపురం డెలివరీ పాయింట్ వరకు



జరిగిన పనులను ఆయన సమగ్రంగా పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. త్వరలోనే చెరువులు, ఆరుతడి పంటలకు సాగునీరు ఈ సందర్భంగా ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ మాట్లాడుతూ, తాళ్లూరు లిఫ్ట్ మొదటి పైప్‌లైన్ నిర్మాణ పనులు దాదాపు ముగింపు దశకు చేరుకున్నాయని తెలిపారు. సెప్టెంబర్ 15 నుంచి 20వ తేదీలోపు మొదటి పైప్‌లైన్ ద్వారా నీటి విడుదలను ప్రారంభించేలా విద్యుత్ శాఖ, ప్రాజెక్టు అధికారులతో సమన్వయం చేసుకుంటున్నట్లు వెల్లడించారు. ప్రాజెక్టు ప్రారంభమైతే ముందుగా నియోజకవర్గంలోని చెరువులను నింపడంతో పాటు, ఆరుతడి పంటలకు సమృద్ధిగా నీరందించేందుకు సన్నాహాలు చేస్తున్నామన్నారు. సోమవారం అమరావతిలో గౌరవ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడిని కలిసి తాళ్లూరు లిఫ్ట్ పనుల సమగ్ర నివేదికను అందజేయనున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. సీఎం సమయం, షెడ్యూల్‌ను బట్టి ప్రారంభోత్సవం ఎవరి చేతుల మీదుగా జరుగుతుందనే విషయాన్ని చర్చించి నిర్ణయిస్తామని స్పష్టం చేశారు. రైతుల ప్రయోజనాలే ధ్యేయంగా పనులను గడువులోగా పూర్తి చేసేందుకు యంత్రాంగం నిరంతరం శ్రమిస్తోందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, ఇరిగేషన్ మరియు విద్యుత్ శాఖల ఉన్నతాధికారులు, నిర్మాణ సంస్థ ప్రతినిధులు, స్థానిక రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# నంద్యాల రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో పి.డి. శ్రీనివాసులకు ఘన సన్మానం


రుద్రవరం.పల్లె వెలుగు : ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని క్రీడారంగంలో మరియు స్కాట్ మాస్టర్‌గా విశిష్ట సేవలు అందిస్తున్న రుద్రవరం ఏపీ
మోడల్ స్కూల్ & జూనియర్ కళాశాల, ఫిజికల్ డైరెక్టర్ పేరూరు శ్రీనివాసులు ని రోటరీ క్లబ్ నంద్యాల ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. విద్యార్థుల్లో దాగి ఉన్న క్రీడా ప్రతిభను వెలికితీస్తూ, స్కాట్ మాస్టర్‌గా వారిని జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీలకు తీర్చిదిద్దడంలో శ్రీనివాసులు చేస్తున్న విశేష కృషిని రోటరీ క్లబ్ సభ్యులు అభినందించారు. క్రీడలు, స్కౌట్స్ అండ్ గైడ్స్ ద్వారా విద్యార్థుల్లో క్రమశిక్షణ, నాయకత్వ లక్షణాలు, సేవాభావం, ఆత్మవిశ్వాసం పెంపొందించేందుకు ఆయన చేస్తున్న సేవలను ప్రశంసించారు. ఈ సందర్భంగా పేరూరు శ్రీనివాసులు కు శాలువా కప్పి, జ్ఞాపిక అందజేసి ఘనంగా సత్కరించారు. ఈ సన్మానం ఆయన వ్యక్తిగత ప్రతిభకు మాత్రమే కాకుండా, ఏపీ మోడల్ స్కూల్ రుద్రవరం విద్యార్థుల క్రీడా, స్కౌటింగ్ విజయాలకు లభించిన గౌరవంగా



భావిస్తున్నామని ప్రిన్సిపాల్ సంగెపు నాగేశ్వరరావు తెలిపారు. శ్రీనివాసులు కి లభించిన ఈ గౌరవంపై పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు హర్షం వ్యక్తం చేసి హృదయపూర్వక అభినందనలు తెలిపారు. భవిష్యత్తులో కూడా మరిన్ని విజయాలు సాధించి పాఠశాలకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.

# బీజేపీ కిసాన్ మోర్చా మండల అధ్యక్షుడిగా జయచంద్ర

మహానంది, పల్లె వెలుగు బిజెపి పార్టీ కిసాన్ జయచంద్రను ఎన్నుకున్నట్లు బిజెపి పార్టీ కిషన్



మోర్చా మండల అధ్యక్షుడిగా చాకలి మోర్చా రాష్ట్ర సీడ్స్ సేల్ కన్వీనర్ పడకండ్ల నాగేశ్వరరావు పేర్కొన్నారు. ఆదివారం మహానంది మండలం గాజులపల్లె గ్రామంలో బిజెపి పార్టీ కిషన్ మోర్చా రాష్ట్ర సీడ్స్ సేల్ కన్వీనర్ నాగేశ్వరరావు, జిల్లా అధ్యక్షుడు బిజ్జెం సుబ్బారెడ్డి ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. జయచంద్ర మాట్లాడుతూ..బిజెపి పార్టీ బలోపేతం కోసం కృషి చేస్తానని, రైతుల కోసం నిరంతరం పాటు పడతానన్నారు. తనపై నమ్మకంతో కిసాన్ మోర్చా మండల అధ్యక్షుడిగా నియమించినందుకు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో కిసాన్ మోర్చా జిల్లా కార్యదర్శులు సాయి దత్తు, చిరంజీవి రెడ్డి, బిజెపి మండల అధ్యక్షుడు జి. రాంబాబు, మండల కార్యదర్శి వెంకటనారాయణ బిజెపి కార్యకర్తలు మునిశేఖర్, మునిశ్వర్, మునేంద్ర, సుబ్రమణ్యం తదితరులు పాల్గొన్నారు.

# జాతీయ కిక్‌బాక్సింగ్ పోటీలకు ఏపీ జట్టు పయనం

అగనంపూడి, సెప్టెంబర్6(పల్లె వెలుగు): మధ్య ప్రదేశ్‌లోని ఇండోర్‌లో ఈనెల 7 నుంచి 12వ తేదీ



వరకు జరగనున్న జాతీయ స్థాయి సీనియర్ కిక్‌బాక్సింగ్ పోటీల్లో పాల్గొనేందుకు ఆంధ్రప్రదేశ్ జట్టు శనివారం విశాఖపట్నం నుంచి బయలుదేరింది. ఇటీవల నిర్వహించిన ఎంపిక పోటీల ద్వారా వివిధ విభాగాల్లో ప్రాతినిధ్యం వహించేందుకు 19 మంది క్రీడాకారులతో కూడిన రాష్ట్ర జట్టును ఎంపిక చేశారు. ఈ సందర్భంగా విశాఖలోని హోటల్ కారెంట్‌లో ఏర్పాటు చేసిన వీడ్కోలు కార్యక్రమంలో జిల్లా ఒలింపిక్ సంఘం ప్రధాన కార్యదర్శి, అంతర్జాతీయ వెయిట్‌లిఫ్టింగ్ రిఫరీ కంచరపాటి సూర్యనారాయణ ముఖ్య అతిథిగా హాజరై క్రీడాకారులను అభినందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. క్రీడాకారులు క్రమశిక్షణతో మెలగాలని, పోటీల్లో చివరి వరకు పట్టువదలకుండా పోరాడి పతకాలు సాధించి రాష్ట్రానికి, విశాఖ నగరానికి మంచి పేరు ప్రఖ్యాతులు తీసుకురావాలని ఆకాంక్షించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నేతృత్వంలోని రాష్ట్ర ప్రభుత్వం క్రీడలకు అత్యంత ప్రాధాన్యతనిస్తోందని, జాతీయ స్థాయిలో పతకాలు గెలుపొందే క్రీడాకారులకు పెద్దఎత్తున ప్రోత్సాహకాలు అందించి అండగా నిలుస్తోందని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కిక్‌బాక్సింగ్ అసోసియేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ అధ్యక్షుడు జి. ఆనందబాబు, హోటల్ అధినేత బి. నాగరాజు, కోచ్ శివసాగర్, రిఫరీలు జోగారావు, జాన్సీ, బలరాం, సంతోష్ తదితరులు పాల్గొని క్రీడాకారులకు శుభాకాంక్షలు తెలిపారు.

# సంఘ నాయకుడు గోడ్డి కన్నారావుకు ఆత్మీయ సన్మానం

విశాఖపట్నం/అగనంపూడి, సెప్టెంబర్6(పల్లె వెలుగు): విశాఖ జిల్లా యాత, శెట్టిబలిజ సంఘం



నాయకులు శ్రీ గోడ్డి కన్నారావు గారిని అగనంపూడి శెట్టిబలిజ సంఘం ప్రతినిధులు ఆదివారం మర్యాదపూర్వకంగా కలిసి, ఘనంగా సన్మానించారు. అగనంపూడి సంఘం అధ్యక్షులు శ్రీ కడవల నాయుడు, కార్యదర్శి శ్రీ గెద్దాడ రమేష్ ఆయనను శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ భేటీలో శెట్టిబలిజ కులస్తుల సమైక్యత, సంఘ బలోపేతం, భవిష్యత్ సేవా కార్యక్రమాలు మరియు కార్యాచరణపై విస్తృతంగా చర్చించారు. ఈ సందర్భంగా శ్రీ గోడ్డి కన్నారావు మాట్లాడుతూ, సంఘం చేపట్టే ప్రతి అభివృద్ధి కార్యక్రమానికి, కుల బాంధవుల సంక్షేమానికి తన వంతుగా అన్ని విధాలా పూర్తి సహకారం అందిస్తానని స్పష్టం చేశారు. కార్యక్రమంలో సంఘం ప్రతినిధులు, సభ్యులు పాల్గొన్నారు.

# మన బాధ్యత ఫౌండేషన్ ఆధ్వర్యంలో వృద్ధులకు, అనాథలకు అన్నదానం

రాజమండ్రి, సెప్టెంబర్ 06 (పల్లె వెలుగు): రాజమండ్రికి చెందిన గారా దుర్గ ప్రసాద్, సుమలత దంపతుల కుమార్తె అశ్లీన్ మొదటి పుట్టినరోజు వేడుకలను ఆదివారం మానవీయ ఐక్య సేవా



అసోసియేషన్ ఆశ్రమంలో నిర్వహించారు. ఈ సందర్భంగా వారి కుటుంబ సభ్యుల సహకారంతో మన బాధ్యత ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆశ్రమవాసులైన వృద్ధులకు, అనాథలకు అన్నదాన కార్యక్రమం చేపట్టారు. మన బాధ్యత ఫౌండేషన్ రాజమండ్రి సిటీ ప్రెసిడెంట్ శ్రీవిద్య, వైస్ ప్రెసిడెంట్ నాగార్జున నేతృత్వంలో ఈ సేవా కార్యక్రమం జరిగింది. ఆశ్రమంలోని అభాగ్యులకు భోజన వసతి కల్పించడం పట్ల స్థానికులు హర్షం వ్యక్తం చేశారు. పుట్టినరోజు జరుపుకుంటున్న చిన్నారి అశ్లీన్ ఆయురారోగ్యాలతో, ఉన్నతమైన భవిష్యత్తుతో విజయవంతమైన జీవితాన్ని పొందాలని పలువురు ఆకాంక్షించారు. ఈ అన్నదాన కార్యక్రమంలో లక్ష్మి, ప్రేమలత, శేఖర్, హారిక, గీతిక, మోక్షిత, రమేష్ తదితరులు పాల్గొన్నారు

# ఐటీఐ విద్యార్థులకు అమర రాజా కంపెనీలో ఉద్యోగాలు

యానం, సెప్టెంబర్ 06 (పల్లె వెలుగు): స్థానిక ఎన్ఎస్‌సీబీ ప్రభుత్వ ఐటీఐలో ఎలక్ట్రానిక్స్



మెకానిక్ ట్రేడ్‌కు చెందిన ఇద్దరు విద్యార్థులు హైదరాబాద్‌లోని అమర రాజా అడ్వాన్స్‌డ్ సెల్ టెక్నాలజీస్ ప్రైవేట్ లిమిటెడ్‌లో ఉద్యోగాలకు ఎంపికైనట్లు ఐటీఐ ప్రిన్సిపాల్ చింతపల్లి కృష్ణ సుధాకర్ తెలిపారు. ఉద్యోగాలకు ఎంపికైన జల్లి మాణికంఠ ఈశ్వర్, కాగిత తరుణ్ కుమార్‌లను ఆయన అభినందించి, భవిష్యత్తులో మరిన్ని ఉన్నత విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ, ఐటీఐలో అందిస్తున్న నైపుణ్య ఆధారిత సాంకేతిక శిక్షణకు విద్యార్థుల ఉద్యోగ ఎంపికలు చక్కటి నిదర్శనమని పేర్కొన్నారు. శిక్షణార్థులు నిరంతరం తమ నైపుణ్యాలను అభివృద్ధి చేసుకుంటూ, పరిశ్రమల్లో అందుబాటులో ఉన్న అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. నైపుణ్యం కలిగిన యువతకు అవకాశాలు కల్పించిన అమర రాజా యాజమాన్యానికి యానం ఐటీఐ తరపున కృతజ్ఞతలు తెలిపారు. ఉద్యోగాలు సాధించిన జల్లి మాణికంఠ ఈశ్వర్, కాగిత తరుణ్ కుమార్‌లను ఐటీఐ సిబ్బంది, తోటి విద్యార్థులు ప్రత్యేకంగా అభినందించారు

# అంబేద్కర్ ఆశయాలే సమాజానికి మార్గదర్శకం

ఆలేరు (పల్లె వెలుగు): దభారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ ఆశయాలు



సమాజానికి ఎప్పటికీ మార్గదర్శకమని శ్రమశక్తి అవార్డు గ్రహీత డాక్టర్ చిలుకు స్వామి అన్నారు. గుండ్లగూడెం గ్రామంలో అంబేద్కర్ విగ్రహ నిర్మాణానికి నిర్వహించిన భూమిపూజ కార్యక్రమం ఆదివారం ఘనంగా జరిగింది. అంబేద్కర్ విగ్రహ నిర్మాణ కమిటీ అధ్యక్షుడు విజయ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి డాక్టర్ చిలుకు స్వామి హాజరై ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అంబేద్కర్ తన జీవితాన్ని సమానత్వం, సామాజిక న్యాయం, విద్య, మానవ హక్కుల కోసం అంకితం చేశారని తెలిపారు. ఎన్నో ప్రతికూల పరిస్థితులను ఎదుర్కొంటూనే విద్యను ఆయుధంగా చేసుకుని దేశ ప్రజలకు స్ఫూర్తిగా నిలిచారని కొనియాడారు. అంబేద్కర్ విగ్రహం కేవలం శిల్పం కాదని, సమానత్వం, స్వాభిమానం, సామాజిక న్యాయం, రాజ్యాంగ విలువలకు ప్రతీకగా నిలుస్తుందని పేర్కొన్నారు. నేటి యువత అంబేద్కర్ జీవితాన్ని ఆదర్శంగా తీసుకుని విద్యకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని, సమాజ అభివృద్ధికి తమ వంతు కృషి చేయాలని పిలుపునిచ్చారు. "చదువుకోండి.. సంఘటితంగా ఉండండి.. ఉద్యమించండి" అనే అంబేద్కర్ సందేశం నేటి తరానికి కూడా స్ఫూర్తిదాయకమని అన్నారు. విగ్రహ నిర్మాణ పనులను నాణ్యతా ప్రమాణాలతో నిర్ణీత సమయంలో పూర్తి చేసి భవిష్యత్ తరాలకు స్ఫూర్తిగా నిలపాలని ఆకాంక్షించారు. విగ్రహ నిర్మాణ కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు సహకరిస్తున్న దాతలు, ప్రజాప్రతినిధులు, అధికారులు, గ్రామ పెద్దలు, యువతను డాక్టర్ చిలుకు స్వామి అభినందించారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ ఏసిరెడ్డి మంజుల మహేందర్ రెడ్డి, ఉపసర్పంచ్, వార్డు సభ్యులు, గ్రామ ప్రముఖులు, యువకులు, అంబేద్కర్ అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

Printed and published by M.Mahesh babu on behaly of m/s mahesh publications # 13-36A, Nelliveedhi, Nandyal District, Nadyal printed at sai Aishwayam Apartment, Near Bharatha Matha Temple B-Block, Flat no 105, Tekke, Nandyal (Dist) AP pin-code 518501 EDITOR; M Mahesh Babu RNI No: APTEL/2012/46499Phone No :-9849499960,9059696959 Email id: Pallevelugunews9@gmail.com